తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

మెదక్ - మహబూబ్‌నగర్

సంగారెడ్డి | సిద్దిపేట | జోగులాంబ గద్వాల | వనపర్తి | నారాయణపేట | నాగర్ కర్నూల్

శుక్రవారం

17 జూలై 2026




## అద్వానంగా అంగన్వాడి కేంద్రాలు..

- ఇబ్బందుల్లో చిన్నారులు, గర్భిణీలు
- పుల్కల్ మండలంలో నెలకొన్న దయనీయ పరిస్థితి
- అధికారుల నిర్లక్ష్యంపై ప్రజల ఆగ్రహం



**పుల్కల్, జూలై 16(జనంసాక్షి):** సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండల పరిధిలోని పలు అంగన్వాడి కేంద్రాలు అధ్వాన్న పరిస్థితుల్లో కొనసాగుతున్నాయి. చిన్నారుల పోషణ, గర్భిణీలు, బాలింతలకు సేవలు అందించాల్సిన ఈ కేంద్రాల్లో కనీస మౌలిక వసతులు లేకపోవడంతో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని కేంద్రాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో నిర్వహిస్తుండగా, మరికొన్ని కేంద్రాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అందులో ముఖ్యంగా సింగూరు నాలుగో సెంటర్ మరీ అధ్వానంగా మారింది.వర్షం పడితే సిమెంట్ రేకులు ఎప్పుడు కూలి కింద పడిపోతాయో తెలియని అయోమయం స్థితిలో చిన్నారులు విద్యనభ్యసిస్తున్నారు. కేంద్రాల్లో తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, విద్యుత్, ఫ్యాన్లు వంటి ప్రాథమిక సదుపాయాలు లేక చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు.వర్షాకాలంలో భవనాల్లోకి నీరు చేరడం, పైకప్పులు కారడం వల్ల చిన్నారుల భద్రతపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.కొన్ని చోట్ల పిల్లలు కూర్చునేందుకు సరిపడా ఫర్నిచర్ కూడా లేకపోవడం గమనార్హం.అంగన్వాడి కేంద్రాల్లో అందించాల్సిన పోషకాహార పంపిణీ, ప్రీ-స్కూల్ విద్యా కార్యక్రమాలు కూడా సరైన వాతావరణం

మిగతా 10లో..

## ఒక్కడే విద్యార్థి.. ఇద్దరు ఉపాధ్యాయులు..!

- రాయిచేడ్ పాఠశాలలో వెలవెలబోతున్న విద్య
- గతేడాది నలుగురు.. ఈ ఏడాది ఒక్కరే..!
- గ్రామీణ విద్యకు అద్దం పడుతున్న రాయిచేడ్ పాఠశాల
- విద్యార్థులు లేక వెలవెలబోతున్న ప్రభుత్వ బడి
- బడిబాట కార్యక్రమం ఉన్నా.. బడిలో పిల్లలు కరువు
- గ్రామాల్లో క్షీణిస్తున్న విద్యా ప్రమాణాలు



**అచ్చంపేట, జూలై 16 (జనంసాక్షి):** నియోజకవర్గ పరిధిలోని ఉప్పునుంతల మండలం రాయిచేడ్ గ్రామంలోని ప్రాథమిక పాఠశాల పరిస్థితి గ్రామీణ విద్యావ్యవస్థకు అద్దం పడుతోంది. ఈ పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తుండగా, ప్రస్తుతం ఒక్క విద్యార్థి మాత్రమే నమోదై ఉండటం గమనార్హం. అయితే ఆ విద్యార్థి కూడా పాఠశాలకు సక్రమంగా హాజరు కావడం లేదని గ్రామస్థులు చెబుతున్నారు.

గత విద్యా సంవత్సరంలో ఈ పాఠశాలలో నలుగురు విద్యార్థులు ఉండగా, ఈ ఏడాది ఆ సంఖ్య మరింత తగ్గిపోయింది. గురువారం మీడియా ప్రతినిధులు పాఠశాలను సందర్శించగా, ఇద్దరు ఉపాధ్యాయులకుగాను ఒకరు మాత్రమే విధుల్లో కనిపించారు. మరో ఉపాధ్యాయుడు సెలవులో ఉన్నట్లు సమాచారం.

గ్రామస్థుల కథనం ప్రకారం, కొందరు ఉపాధ్యాయులు సమయానికి పాఠశాలకు రావడం లేదని, విద్యార్థుల తల్లిదండ్రులను కలుసుకుని పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టలేదని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట' కార్యక్రమం ద్వారా బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ, సంబంధిత ఉపాధ్యాయులు గ్రామంలో తగిన అవగాహన కార్యక్రమాలు నిర్వహించలేదని సమయపాలన పాటించడం లేదని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడాల్సిన అవసరం ఉన్నప్పటికీ, సంబంధిత అధికారులు పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. కొందరు ఉపాధ్యాయులు తమ ప్రధాన బాధ్యతలను పక్కనపెట్టి ఇతర కార్యకలాపాల్లో నిమగ్నమవుతూ ఉపాధ్యాయ వృత్తి గౌరవానికి భంగం కలిగిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి.

ఈ విషయమై పాఠశాల కాంప్లెక్స్ హెచ్ఎం ఆంజనేయులను ఫోన్‌లో సంప్రదించగా, ఆ పాఠశాలలో వెంకటరామ్, లక్ష్మణ్ అనే ఇద్దరు ఉపాధ్యాయులు విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. వెంకటరామ్ సెలవులో ఉండగా, లక్ష్మణ్ విధుల్లో ఉన్నారని చెప్పారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉన్న నేపథ్యంలో ఆయా ఉపాధ్యాయులను విద్యార్థులు అధికంగా ఉన్న పాఠశాలలకు డిప్యూటేషన్‌పై పంపించేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు.

## 1.35 కోట్లతో 16 ప్రభుత్వ పాఠశాలల్లో స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు

- నాగర్‌కర్నూల్ పార్లమెంటు సభ్యులు మల్లురవి





**వనపర్తి బ్యూరో, జూలై 16 (జనంసాక్షి):** విద్యార్థులు స్మార్ట్ క్లాస్‌రూమ్‌లను సద్వినియోగం చేసుకుని ఉత్తమ ఫలితాలు సాధించాలని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి పిలుపునిచ్చారు. వనపర్తి జిల్లా మద్రికుంట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన స్మార్ట్ క్లాస్‌రూమ్‌ను గురువారం జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం స్మార్ట్ బోర్డుపై విద్యార్థులకు శుభాకాంక్షలు తెలుపుతూ సంతకం చేశారు.

ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విద్య అందించాలనే లక్ష్యంతో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సీఎస్ఆర్ నిధుల ద్వారా జిల్లాలోని 16 ప్రభుత్వ పాఠశాలల్లో రూ.1.35 కోట్ల వ్యయంతో స్మార్ట్ క్లాస్‌రూమ్‌లు ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు.

అనంతరం 9వ తరగతి విద్యార్థులతో ముచ్చటించిన ఆయన, తమ చిన్నతనంలో ఇలాంటి ఆధునిక సౌకర్యాలు అందుబాటులో లేవని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రభుత్వం కల్పిస్తున్న విద్యా సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని కష్టపడి చదివి పదో తరగతిలో 100 శాతం ఉత్తీర్ణతతో పాటు అత్యుత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ, విద్యార్థులు సాంకేతికతను విద్యాభ్యాసంలో సమర్థవంతంగా వినియోగించుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని అన్నారు. స్మార్ట్ క్లాస్‌రూమ్‌ల ద్వారా బోధన మరింత ప్రభావవంతంగా మారి విద్యార్థుల అభ్యాస నైపుణ్యాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.

కార్యక్రమంలో లీడ్ బ్యాంక్ డిస్ట్రిక్ట్ మేనేజర్ శివ కుమార్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మహబూబ్‌నగర్ క్లస్టర్ హెడ్ ప్రవీణ్ కుమార్ ఝా, జీఐబీ స్టేట్ హెడ్ పీ.జే. శ్రావణ్ కుమార్, బ్రాంచ్ మేనేజర్ సీహెచ్ వెంకటేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## 13 ఏళ్ల బాలికపై లైంగిక దాడి

- నిందితుడికి 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.10 వేల జరిమానా
- నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ




**మెదక్ బ్యూరో, జులై 16 (జనంసాక్షి):**
13 ఏళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి మెదక్ జిల్లా ఫాస్ట్ ట్రాక్ పోక్సో కోర్టు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10,000 జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు తెలిపారు.

2022 అక్టోబర్ 10న ఆరోగ్యం బాగాలేక బాలిక ఇంటి వద్దే ఉన్న సమయంలో, టైర్ పంక్చర్ దుకాణం యజమాని మహ్మద్ షంశొద్దీన్ మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఆమె ఇంటికి వెళ్లి, "మీ అమ్మకు ఇవ్వాల్సిన డబ్బులు ఉన్నాయి.. బయటకు వస్తే ఇస్తాను" అంటూ నమ్మించి ఇంటి బయటకు పిలిచాడు. అనంతరం ఆమె చేతిని పట్టుకుని సమీపంలోని పొదల్లోకి బలవంతంగా లాక్కెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక గట్టిగా చాలా సేపు కేకలు వేయడంతో భయపడిన నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. బాలిక ఏడుస్తూ ఇంటికి వెళ్లి జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు తెలియజేయగా, వారి ఫిర్యాదు మేరకు అప్పటి శంకరంపేట-ఆర్ పోలీస్ స్టేషన్ ఎస్ఐ సుభాష్ గౌడ్ పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. అనంతరం అప్పటి తూప్రాన్ డీఎస్పీ యాదగిరి రెడ్డి దర్యాప్తు చేపట్టి, బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించి మెడికల్ ఎవిడెన్స్, సాక్షుల వాంగ్మూలాలు, ఇతర శాస్త్రీయ ఆధారాలను సేకరించి కోర్టులో పకడ్బందీగా అభియోగపత్రం దాఖలు చేశారు. బాధితురాలికి భరోసా కేంద్రం లీగల్ అడ్వైజర్ శ్వేతా న్యాయపరమైన సహకారం అందించడంతో పాటు సాక్ష్య ప్రక్రియలో అండగా నిలిచారు. విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలయ్య సమర్థవంతంగా వాదనలు వినిపించారు.

మెడికల్ ఎవిడెన్స్, సాక్షుల వాంగ్మూలాలు, శాస్త్రీయ ఆధారాలతో పాటు ఇతర సాక్ష్యాలను పరిశీలించిన మెదక్ ఫాస్ట్ ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి సుభావలి నిందితుడు మహ్మద్ షంశొద్దీన్‌ను దోషిగా నిర్ధారించి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.10,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కేసులో కోర్టు లైజనింగ్ అధికారి ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ కృష్ణ, సీడీఓ శ్రీధర్ తదితరులు విచారణ ప్రక్రియలో సమన్వయం చేసి సహకరించారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన సిబ్బందిని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అభినందించారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ పై పోలీసుల ఉక్కుపాదం

- ఒకరికి జైలు శిక్ష

**తెలకపల్లి, జూలై 16, (జనంసాక్షి):** మండల కేంద్రంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో నమోదైన నాలురిపై కేసులను కేసులు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై యం. రమేష్ గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ మార్నింగ్ కోర్టులో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రామ్ గోపాల్ విచారించి తీర్పు వెలువరించగా కోర్టు తీర్పు మేరకు లింగాల గ్రామానికి చెందిన మూడవతు నాగరాజు (తండ్రి: రాములు)కు రూ.2,100 జరిమానా, తెలకపల్లి గ్రామానికి చెందిన అతినారపు కిరణ్ కుమార్ (తండ్రి: బుచ్చన్న) కు రూ.5,000 జరిమానా, కోమటికుంట గ్రామానికి చెందిన తెప్ప వెంకటయ్య (తండ్రి: హుస్సేన్)కు రూ.2,000 జరిమానా విధించింది. అలాగే గడ్డంపల్లి గ్రామానికి చెందిన వడ్డేమాన్ శ్రీను (తండ్రి: రాములు) కు మూడు రోజుల సాధారణ జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చిందని, అనంతరం ఆయనను నాగర్‌కర్నూల్ జిల్లా సబ్‌జైలుకు తరలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాహనదారులు తప్పనిసరిగా వాహన పత్రాలు వెంట ఉంచుకోవాలని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, రాంగ్ రూట్‌లో ప్రయాణించకూడదని, అతివేగంగా వాహనాలు నడపకుండా ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు.

### తెలంగాణ రక్షణ సేన పార్టీ

# ఇంచార్జిగా డీకే సీహెచ్ వెంకటన్న



**మక్తల్, జూలై 16 (జనంసాక్షి):** తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ రాష్ట్రవ్యాప్తంగా సంస్థాగత నిర్మాణాన్ని బలోపేతం చేసే క్రమంలో తొలి విడతగా నియోజకవర్గ ఇంచార్జిల నియామకాలను చేపట్టింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధినేత్రి కల్వకుంట్ల కవిత రాష్ట్రంలోని 23నియోజకవర్గాలకు ఇంచార్జిలను ప్రకటించారు. ఇందులో భాగంగా మక్తల్ నియోజకవర్గ ఇంచార్జిగా డీకే సీహెచ్ వెంకటన్నను నియమించారు. ఈ సందర్భంగా నూతన ఇంచార్జి డీకే సీహెచ్ వెంకటన్న మాట్లాడుతూ తనపై విశ్వాసం ఉంచి బాధ్యతను అప్పగించిన పార్టీ రాష్ట్ర అధినేత్రి కల్వకుంట్ల కవితకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలు, తెలంగాణ ఆత్మగౌరవం, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా మక్తల్ నియోజకవర్గంలో గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని కార్యకర్తలు, నాయకులు, అభిమానులందరినీ సమన్వయం చేసుకుని పార్టీ విస్తరణకు కృషి చేస్తానని, తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పార్టీ అభివృద్ధి కోసం తన వంతు బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని వెంకటన్న తెలిపారు. పార్టీ బలోపేతం కోసం త్వరలోనే గ్రామస్థాయిలో సమావేశాలు, సభ్యత్వ నమోదు కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆయన వెల్లడించారు.

## జీవో నెం.9ని రద్దు చేయాలని బీసీ జాగృతి సేన డిమాండ్



**జడ్చర్ల, జూలై 16 (జనంసాక్షి):** పేద విద్యార్థుల ఉన్నత విద్యకు ఆటంకం కలిగించే జీవో నెం. 9ని వెంటనే రద్దుచేయాలని బీసీ జాగృతి సేన డిమాండ్ చేసింది. గురువారం జడ్చర్ల మండల విద్యా వనరుల కేంద్రం ఆవరణలో జరిగిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు బూర్గుపల్లి కృష్ణ యాదవ్ మాట్లాడుతూ ఈ జీవో వల్ల 14 లక్షల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, అగ్రవర్ణ పేద విద్యార్థుల చదువులకు ఇబ్బంది కలుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని యథావిధిగా అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 8 వేల కోట్ల బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ప్రభుత్వం మొండి వైఖరి వీడకుంటే విద్యార్థి, బీసీ సంఘాలతో కలిసి రాష్ట్ర వ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో రఘునందన్ చారి, గొడుగు నర్సిములు, మాచారం శ్రీనివాస్, లింగంపేట్ గౌరీశంకర్, శేఖర్, గోపాల్, కట్ట మురళి, సురభి రఘు, చెన్నయ్య, వెంకటేష్, చాపల శ్రీనివాస్, అంజి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో టైప్ రైటింగ్ పరీక్షలు



**సంగారెడ్డి, జులై 16 (జనంసాక్షి):** టి.టి.ఎస్.సి.ఐ.ఎ. తెలంగాణ స్టేట్ 17, 18 తేదీలలో టైప్ రైటింగ్ పరీక్షలు రెండు రోజుల పాటు సంగారెడ్డి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల, ఇస్మాయిల్ ఖాన్‌పేట్ సమీపంలో ఉదయం 8:30 గంటల నుంచి సాయంత్రం 5:00గంటల వరకు నిర్వహించబడతాయని పేర్కొన్నారు. రోజుకు నాలుగు బ్యాచ్‌ల చొప్పున పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. టైప్ రైటింగ్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థిని విద్యార్థులు తమకు కేటాయించిన సమయానికి ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకుని పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసుకోవాలని బి.కృష్ణమూర్తి విజ్ఞప్తి చేశారు



## పశువులకు అమ్మతల్లి నివారణ టీకాలు

**కృష్ణ, జూలై 16 (జనంసాక్షి):** కృష్ణ మండలంలో 2 వేల500 పశువులకు ఉచిత ఎల్ ఎస్ డి, టీకాలు వేయడం జరిగిందని మండల పశు వైద్యాధికారి రమణ సిద్ధార్థ తెలిపారు. మండలం పరిధిలోని పశు సంరక్షణ చర్యలు బలోపేతం చేయడానికి మండలం పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉన్న పశువులకు వెటర్నరి అసిస్టెంట్ లింగప్ప, జూన్ 30 నుంచి జులై 10 వరకు, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి ఈ బృందాల ద్వారా ఎద్దులకు, మొత్తం 2,500 పశు వులకు ఉచిత ఎల్ ఎస్ డి, అమ్మతల్లి, టీకాలు వేశారని తెలిపారు. అనంతరం రికార్డులను జిల్లా పశు వైద్యాధికారి జగదీశ్వరికి పంపించామని బుధవారం పశు వైద్య అసిస్టెంట్ లింగప్ప తెలిపారు.

### ఇందిరమ్మ ఇళ్లపై

# విజిలెన్స్ అధికారుల విచారణ



**అమరచింత, జూలై16 (జనంసాక్షి):** మండలంలోని పామిరెడ్డి పల్లి గ్రామంలో గురువారం రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు విజిలెన్స్ అధికారి. బాల్‌రామ్ వనపర్తి జిల్లా పిడి, ఎంపీఓ, ఏయిలతో కలిసిన బృందం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో 50 వేల లంచం అడిగిన విషయంపై విచారణ చేశారు. గ్రామంలోని లబ్ధిదారుల ఇండ్లకు వెళ్లి విచారణ చేయగా ఎవరు కూడా తమకు లంచం అడగలేదని ఎవరికీ డబ్బులు ఇవ్వలేదని బాధితులు అధికారులకు తేల్చి చెప్పారు. దీంతో విజిలెన్స్ అధికారులు మాట్లాడుతూ ఇంటి బిల్లు విషయంలో లంచం అడిగినట్టు ఎలాంటి ఆధారాలు లేవని, ఆరోపణలు నిజం లేదని అధికారులు తేల్చి చెప్పారు.

# చెమటోడ్చినోడికి చేతకానితనం..దోచుకున్నోడికి దొరతనం

- గద్వాల పత్తి సాగులో నీలి నీడలు!
- దళారుల జేబుల్లో కోట్లు, రైతన్న ? కంట కన్నీరు!
- పట్టు తప్పుతున్న గద్వాల పత్తి సాగు!
- కంపెనీల గుత్తాధిపత్యం.. రాజకీయాల ఉదాసీనత

**జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి, జూలై 16 (జనంసాక్షి):** ఒకప్పుడు విత్తన పత్తి సాగుకు కేరాఫ్ అడ్రస్‌గా పేరొందిన నడిగడ్డ ప్రాంతం ప్రస్తుతం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. బహుళజాతి విత్తన కంపెనీల గుత్తాధిపత్యం, దళారుల దోపిడీ, రాజకీయ అండదండలు, ప్రకృతి వైపరీత్యాల ప్రభావంతో పత్తి సాగు గణనీయంగా తగ్గిపోయింది. శ్రమను నమ్ముకున్న రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోతుంటే, మధ్యవర్తులు మాత్రం కోట్ల రూపాయలు ఆర్జిస్తూ విలాసవంతమైన జీవితాలు గడుపుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

గత కొన్నేళ్లుగా రికార్డుస్థాయిలో సాగైన విత్తన పత్తి ఈ ఏడాది భారీగా తగ్గింది. కంపెనీలు గోదాముల్లో పాత నిల్వలు ఉన్నాయని సాకుగా చూపి రైతుల నుంచి కొనుగోలు చేసే పత్తి ధరలను దారుణంగా తగ్గించాయి. ఇదే సమయంలో పెట్టుబడి ఖర్చులు పెరగడం, వర్షాభావం, భూగర్భ జలాలు తగ్గిపోవడం వల్ల సాగు తీవ్రంగా దెబ్బతింది. సాగునీటి కొరత కారణంగా అనేక మంది రైతులు ఈసారి పత్తి సాగుకు దూరమయ్యారు.

కంపెనీలు, రైతుల మధ్య వారధిగా వ్యవహరించే ఆర్గనైజర్లు భారీ కమిషన్లు పొందుతూ రైతులకు రావాల్సిన ప్రయోజనాలను హరించేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. రాజకీయ నాయకుల అండతో ఈ వ్యవస్థ మరింత బలపడిందని రైతులుఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితిపై రైతుసంఘాలు కలెక్టరేట్, వ్యవసాయ శాఖ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేపట్టాయి. కంపెనీల ధరల నియంత్రణకు ప్రభుత్వ జోక్యం, విత్తన పత్తికి చట్టబద్ధమైన కనీస మద్దతు ధర, దళారీ వ్యవస్థ రద్దు



చేసి ప్రభుత్వ పర్యవేక్షణలో కంపెనీలు నేరుగా రైతుల నుంచి కొనుగోలు చేసే విధానం అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. అలాగే వర్షాభావంతో నష్టపోయిన ప్రతి ఎకరాకు రూ.25 వేల పరిహారం, వచ్చే సీజన్‌కు ఉచిత లేదా సబ్సిడీ విత్తనాలు, ఎరువులు, ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు అందించాలని, వ్యవసాయ రుణాలను రీ-షెడ్యూల్ చేయాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం, జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి కంపెనీల ఏకపక్ష విధానాలు, దళారుల దోపి డీపై కఠిన చర్యలు తీసుకోకపోతే, గద్వాల సీడ్ హబ్ రైతుల సంక్షోభానికి ప్రతీకగా మారే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు.

# నిషేధిత భూమిలో అక్రమ నిర్మాణాలు ఆపాలి

- బిఎస్పి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృథ్వి రాజ్
- బిఎస్పీ ఆధ్వర్యంలో ఆర్డీవో, మున్సిపాలిటీ మేనేజర్‌కు ? వినతిపత్రం

**నాగర్‌కర్నూల్ జిల్లా బ్యూరో, జూలై 16 (జనంసాక్షి):** నాగర్ కర్నూల్ పట్టణ పరిధిలోని నిషేధిత జాబితాలో ఉన్న ప్రభుత్వ భూమిలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను తక్షణమే నిలిపివేయాలని బహుజన్ సమాజ్ పార్టీ (బిఎస్పీ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పృథ్వి రాజ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం బిఎస్పీ ఆధ్వర్యంలో నాగర్ కర్నూల్ ఆర్డీవో అర్చన కు మున్సిపాలిటీ మేనేజర్ వెంకటయ్య కు మరియు తహసీల్దార్ కార్యాలయం ఇన్‌వార్డ్ విభాగంలో వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా పృథ్వీరాజ్ మాట్లాడుతూ, ప్రభుత్వానికి చెందిన సర్వే నంబర్ 367లోని భూమి నిషేధిత జాబితాలో ఉన్నప్పటికీ కొంతమంది ప్రైవేట్ వ్యక్తులు అనధికారికంగా నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపించారు. ప్రజా ఆస్తిగా ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేయడం చట్టవిరుద్ధమని, సంబంధిత అధికారులు వెంటనే జోక్యం చేసుకుని అక్రమ నిర్మాణాలను నిలిపివేయాలని కోరారు. నాగర్‌కర్నూల్ పట్టణంలో ఇప్పటికే ట్రాఫిక్ సమస్య తీవ్రమైందని, జీవనోపాధి కోసం ప్రభుత్వ స్థలాల్లో తోపుడు బండ్లు, చిన్న గుడిసెలు పెట్టుకుని జీవిస్తున్న పేదలపై మాత్రం బుల్‌డోజర్లు ప్రయోగించి తొలగింపులు చేపట్టిన అధికారులు, పట్టణ కేంద్రంలో జరుగుతున్న ఈ భారీ అక్రమ నిర్మాణాలను ఎందుకు గుర్తించడం లేదని ప్రశ్నించారు. బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్న పేద





కుటుంబాల గూడారాలను ఖాళీ చేయించిన మున్సిపల్ అధికారులు, ప్రభుత్వ భూమిలో జరుగుతున్న నిర్మాణాల విషయంలో ఎందుకు మౌనం వహిస్తున్నారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవడానికి త్వరలో అన్ని రాజకీయ పార్టీలు, సామాజిక సంస్థలు, ప్రజా సంఘాల నాయకులతో కలిసి భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామని తెలిపారు. అవసరమైతే న్యాయపరమైన పోరాటం కూడా కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ తాడూర్ మండల అధ్యక్షుడు జన్ను ఆంజనేయులు, నాయకులు మధు తదితరులు పాల్గొన్నారు.

## సాయిక్రిష్ణ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం



కోహెడ, జూలై16 (జనంసాక్షి): మండలంలోని విజంపల్లి గ్రామంలో సర్పంచ్ అన్నాడి శ్రీజ-జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో కోహెడ సాయిక్రిష్ణ హాస్పిటల్ యజ మాని కనగండ్ల శ్రీనివాస్ సహకారంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిం చారు. ఈ సందర్భంగా సర్పంచ్ శ్రీజ-జీవన్ రెడ్డి మాట్లాడుతూ, గ్రామ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు. శిబిరంలో గ్రామ ప్రజలకు ఉచితంగా థైరాయిడ్ పరీక్షలు, రక్తపోటు (బీపీ) పరీక్షలు, రక్తంలో చక్కెర (షుగర్) పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ రంగనవేని వెంకట స్వామి, వార్డు సభ్యులు అన్నాడి రాజేందర్ రెడ్డి, గర్రెపల్లి వేణు, బాలవికాస స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు, కోహెడ సాయి క్రిష్ణ హాస్పిటల్ వైద్యులు, వైద్య సిబ్బంది, గ్రామ ప్రజలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పేటలో ఎస్ఐఆర్‌పై ప్రత్యేక ఫిర్యాదుల శిబిరం



పెద్ద శంకరంపేట, జూలై 16 (జనంసాక్షి): మండల కేంద్రమైన పెద్ద శంకరంపేటలో బస్టాండ్ వద్ద ఉన్న పాత గ్రామపంచాయతీ కార్యాలయంలో ఎస్ఐఆర్‌పై రెండు రోజులపాటు ప్రత్యేక శిబిరం నిర్వహిస్తున్నారు. పేట తాసి ల్దార్ నారాయణ గురువారం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన శిబిరాన్ని సంద ర్శించి పలు సూచనలు సలహాలు ఇచ్చారు. రెండు రోజులపాటు ప్రత్యేక శిబిరం కొనసాగుతున్నట్లు వివరించారు. ఓటరు జాబితా లకు సంబంధించిన దరఖాస్తులు అభ్యంతరాలను అధికారులు స్వీకరించారు. ప్రతి ఒక్కరూ ఎస్ ఐఆర్ ఫారాన్ని పూర్తిచేసి సంబంధిత బిఎల్ఓలకు అందించాలని తాసిల్దార్ నారాయణ సూచించారు. ప్రతిఒక్క ఓటరు తప్పనిసరిగా సర్ సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నాగరాజు ఉన్నారు. ఓటర్లంతా స్పందించాలి

## ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన తహసిల్దార్



అమీన్పూర్, జూలై 15 (జనంసాక్షి): ప్రతిఒక్కరూ వారి ఓటు విలువను తెలుసుకుని ఎస్ఐఆర్‌లో నమోదు చేసుకోవాలని అమీన్పూర్ తాసిల్దార్ వెంక టేష్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలో జరుగుతున్న ఎస్ ఐ ఆర్ ప్రక్రియను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఎస్ఐఆర్ నమోదును ఆగస్టు 3వ తేదీ వరకు పొడిగించిందన్నారు. ఈ అవకాశాన్ని ఓటర్లందరూ సద్వినియోగం చేసుకోవా లన్నారు.

## వార్డు సభ్యురాలి ఇంటిపై దాడియత్నం

- సర్పంచ్‌తో పాటు నలుగురిపై కేసు

గోపాలపేట, జూలై 16 (జనంసాక్షి): బుద్ధారం గ్రామంలో మహిళా వార్డు సభ్యురాలి ఇంటిపై దాడి యత్నం జరిగిన ఘటనలో గ్రామ సర్పంచ్‌తో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు గోపాలపేట ఎస్సై తెలిపారు. మహిళా వార్డు సభ్యురాలు పావని ఫిర్యాదు మేరకు, వార్డు సమస్యపై జరిగిన వివాదం అనంతరం సర్పంచ్ శేఖరయ్య ప్రేరేపణతో హన్మంతు, మొగు లయ్య, నాగేంద్రం, వెంకటయ్యలు ఇంటి వద్దకు వెళ్లి కుటుంబ సభ్యులను బెదిరిస్తూ దాడికి యత్నించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు సర్పంచ్ శేఖరయ్యతో పాటు హన్మంతు, మొగులయ్య, నాగేంద్రం, వెంకటయ్యలపై కేసు నమోదు చేసినట్లు గోపాలపేట ఎస్సై తెలిపారు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని ఆయన వెల్లడించారు.

# ప్రభుత్వ నిర్ణీత ధరలకు డిఏపి విక్రయించాలి

- కావాలని ఎక్కువ ధరకు అమ్మి ప్రభుత్వాన్ని తప్పుదోవపట్టిస్తున్నారు
- విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి
- వ్యవసాయ శాఖ అధికారులతో ఫోన్లో మాట్లాడిన వంగ రాజేశ్వర్ రెడ్డి



సిద్దిపేట, జూలై16, (జనంసాక్షి): సిద్దిపేట నియోజకవర్గ పరిధిలో కొందరు వ్యాపారులు కోరమాం డల్ డీఏపీ ఎరువుల బస్తాలపై ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అదనంగా వసూలు చేస్తున్నారని రైతులు వంగ రాజేశ్వర్ రెడ్డి దృష్టికి తెలపడంతో వెంటనే స్పందించారు. రైతుల ఇబ్బంది లను దృష్టిలో ఉంచుకుని ఆయన నేరుగా సంబంధిత వ్యవసాయ శాఖ అధి కారులతో ఫోన్ ద్వారా మాట్లాడి కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కోరమాండల్ డీఏపీ బస్తాను రూ.1350 లకే ఎటువంటి అదనపు లింకు లేదా 'అటాచ్మెంట్' వస్తువులు లేకుండా విక్రయించేలా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.

**ప్రైస్ డిస్ప్లే బోర్డులు తప్పనిసరి...**

రైతులకు స్పష్టత మరియు పారదర్శకత చేకూరేలా ప్రతి ఎరువుల దుకాణం వద్ద ప్రభుత్వం నిర్ణయించిన ధరల పట్టికను అందరికీ కనిపించేలా ప్రదర్శించాలని అధికారు లకు సూచించారు. వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టించి ఎక్కువ ధరలకు అమ్మితే ఊరుకునేది లేదని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో నియోజకవర్గ రైతాంగా నికి పెద్ద ఎత్తున ఊరట లభించనుంది.రైతు సంక్షేమమే ధ్యేయంగా తక్షణమే స్పందించిన వంగ రాజేశ్వర్ రెడ్డి చొరవ పట్ల నియోజక వర్గ రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## సేవాలాల్ ఆలయ నిర్మాణానికి భూమి పూజ

- మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు



చిన్నశంకరంపేట, జూలై 16(జనంసాక్షి): శ్రీ జగదాంబ సంత సేవాలాల్ ఆలయ గుడి నిర్మాణానికి రూ.60 లక్షలు సొంత నిధులతో మెదక్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు గురువారం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు హలవత్ మోహన్ నాయక్ ఆధ్వర్యంలో భూమి పూజచేశారు.చిన్నశంకరంపేట మండలం కొర్విపల్లి తండాలో సేవాలాల్ ఆలయ నిర్మాణం పనులను పరిశీలిం చారు.అనంతరం ఆయన మాట్లాడుతూ, శ్రీ సంత సేవాలాల్ అడుగుజాడల్లో గిరిజనులు నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పుల్లారావు, కాంగ్రెస్ పార్టీ నాయ కులు రాజిరెడ్డి, సాన సత్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ పోత రాజు రమణ, యాదవరావు, గోపాలరెడ్డి మాజీ ఎంపీపీ అరుణ ప్రభాకర్, రాంచందర్ ఉదయ్ కుమార్, సర్పంచులు, నాయకులు గిరిజన నాయకులు పాల్గొన్నారు.

## అక్రమ గ్యాస్ రీఫిల్లింగ్‌ను అరికట్టుతాం

- ఐదు మందిపై కేసు నమోదు
- 40 కమర్షియల్ సిలిండర్లు
- 22 డొమెస్టిక్ సిలిండర్ల స్వాధీనం



మెదక్ బ్యూరో, జూలై 16 (జనంసాక్షి): అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్ సంఘటనలో ఐదుగురిపై కేసు నమోదు చేయ డంతోపాటు 40 కమర్షియల్, 22 డొమెస్టిక్ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా సివిల్ సప్లయ్ అధికారి నిత్యానంద్ తెలిపారు. గురువారం రోజున జిల్లా సమీకృత కలెక్టరేట్‌లోని అయన కార్యాలయంలో విలేకరులతో మాట్లా డుతూ ఈనెల 14వ తేది రాత్రిమనోహరాబాద్ మండలంలోని పర్కిబండ గ్రామ శివారులో సంఘటనపై వివరాలు వెల్లడిం చారు. సంఘటనకు కారకులైన ఐదుమందిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అలాగే గోదాములో నిల్వ ఉంచిన 40 కమర్షియల్, 22 గృహ వినియోగ సిలిండర్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రజలు అక్రమార్కులను భయపడ కుండా సమాచారం ఇవ్వాలన్నారు. గ్యాస్ అక్రమ వినియో గంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నర్సింహ్మ, ఇన్స్పెక్టర్ గణేష్ పాల్గొ న్నట్లు తెలిపారు.

## గాయపడిన మాజీ సర్పంచ్‌కు ఎమ్మెల్యే పరామర్శ..



సదాశివపేట, జూలై 16(జనంసాక్షి): గాయపడి చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న సదాశివపేట మండల బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, మాజీ సర్పంచ్ అరిపొద్దీన్‌ను సంగా రెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గురు వారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం మేలిగిరిపేట గ్రామానికి వెళ్లిన ఎమ్మెల్యే, ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి తండ్రి అంజిరెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్ర మంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దగొల్ల ఆంజనేయులు,మున్సిపల్ కౌన్సిలర్ కొత్తగొల్ల సోమశేఖర్, సర్పంచులు సంతోష్ గౌడ్, మునిగే సుజాత నవీన్ కుమార్,మాజీ ఎంపీటీసీలు శివకుమార్, హనుమంత్, అహమ్మద్, మాజీ సర్పంచులు లక్ష్మారెడ్డి, హనుమంతు రెడ్డి, పెద్దగొల్ల శ్రీహరి, బాలరాజ్, శేఖర్, పిఏసిఎస్ వైస్ చైర్మన్ పాండు నాయక్, మాజీ ఉపసర్పంచ్ పద్మశాలి రమేష్, సర్వేశ్వర్, భాస్కర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## వర్షాలు సమృద్ధిగా కురవాలని పండరిపురం పాదయాత్ర



కొల్చారం, జూలై 16(జనంసాక్షి): కొల్చారం మండలంలోని చిన్న గనాపూర్ గ్రామానికి చెందిన చంద్రశేఖర్ గౌడ్ వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షిస్తూ రంగంపేటలోని రంగనాయక స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అక్కడినుండి బీదర్ జిల్లా పండరీపురంలోని రంగనాయక స్వామి పుణ్యక్షేత్రానికి పాదయాత్ర చేపట్టారు. రైతులు పాడి పంటలతో సుఖసంతోషాలతో జీవించాలని, గ్రామాల్లో సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని కోరుకుంటూ ఆయన ఈ ఆధ్యాత్మిక పాదయాత్రను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. భక్తి, ఆధ్యాత్మికతతో పాటు రైతుల సంక్షేమాన్ని ఆకాంక్షిస్తూ చేపట్టిన ఈ పాదయాత్రకు గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

## నాయకుడికి డైరెక్టర్ పదవి.. సర్పంచ్ రాజీనామా!

- కాంగ్రెస్‌లో చౌదర్పల్లిలో కొత్త వివాదం
- నాకు పదవి రావడాన్ని జీర్ణించుకోలేకే సర్పంచ్ రాజీనామా
- పిఏసి.సిఎస్.లో డైరెక్టర్‌గా చోటుదక్కించుకున్న బీసీ బిడ్డ ముకుందం



మహమ్మదాబాద్, జూలై 16 (జనంసాక్షి): మహమ్మదాబాద్ మండలంలోని చౌద ర్పల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీలో అంత ర్గత విభేదాలు బహిర్గతమయ్యాయి. ప్రాథ మిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) డైరెక్టర్ పదవి ఓ సీనియర్ నాయకుడికి దక్కడాన్ని జీర్ణించుకోలేక గ్రామ సర్పంచ్ పార్టీకి రాజీనామా చేశా రని ఆ నాయకుడు ఆరోపించారు. చౌదర్పల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ముకుందం గురువారం మీడియాతో మాట్లాడుతూ.. తాను గత 40 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి విధేయుడిగా పనిచేస్తున్నానని తెలిపారు.గతంలో మహమ్మదాబాద్ మండల బీసీ సెల్ అధ్యక్షుడిగా కూడా బాధ్యతలు నిర్వహించానన్నారు.తన సేవలను గుర్తించిన పార్టీ అధిష్ఠానం ఇటీవల ఏర్పాటు చేసిన పీఏసీఎస్ పాలకవర్గంలో తనను డైరెక్టర్‌గా నియమించిందని చెప్పారు.అయితే,తనకు డైరెక్టర్ పదవి రావడాన్ని గ్రామ సర్పంచ్ అనూష సతీష్ రెడ్డి జీర్ణించుకోలేక కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేశారని ముకుందం ఆరోపించారు. ఈ వ్యవహారం మండల కాంగ్రెస్‌లో చర్చనీ యాంశంగా మారింది. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ వార్డ్ వార్డు మెంబర్స్, కార్యకర్తలు, పిఏసిఎస్ డైరెక్టర్ ముకుందం పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులను పరిశీలించిన ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు



**మెదక్ మున్సిపాలిటీ, జూలై 16, (జనంసాక్షి):** మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డులో ఉన్న జర్నలిస్ట్ కాలనీలో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులను మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్‌రావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల నాణ్యత, నిర్మాణ పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్న ఎమ్మెల్యే, పనులను నిర్దేశిత ప్రమాణాలతో వేగంగా పూర్తిచేయాలని సూచించారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని, కాలనీలో మిగిలిన అభివృద్ధి పనులను కూడా దశల వారీగా పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాధిక, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కౌన్సిలర్స్, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## సదాశివపేటలో జూలై 20న శ్రీ జగన్నాథ రథయాత్ర



**సదాశివపేట, జూలై 16(జనంసాక్షి):** సదాశివపేటలో ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో జూలై 20న మధ్యాహ్నం 1 గంటకు నిర్వహించనున్న శ్రీ జగన్నాథ రథయాత్రలో భక్తులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు పులిమామిడి రాజు పిలుపునిచ్చారు. దుర్గమ్మ గుడి నుంచి ప్రారంభమయ్యే రథయాత్ర శాస్త్రి రోడ్, సుభాష్ రోడ్, గాంధీ చౌక్ మీదుగా బసవ సేవాసదన్ ఫంక్షన్ హాల్ వరకు సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమానికి హెచ్. హెచ్. భక్తి వైభవ స్వామి ప్రభుపాద ప్రచారక్ ప్రభువానంద దాస్ ప్రభుజీ హాజరై ఆధ్యాత్మిక సందేశం అందించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రథయాత్ర కరపత్రాన్ని ఇస్కాన్ ప్రతినిధులు పులిమామిడి రాజుకు అందజేసి ముఖ్య అతిథిగా ఆహ్వానించారు.

## విద్యార్థిని తారుణ్యకు మహేంద్ర అండ్ మహీంద్రా నగదు పురస్కారం



**న్యాల్‌కల్, జూలై 16, (జనంసాక్షి):** 2025-26 విద్యా సంవత్సరానికి గాను పదవ తరగతిలో శతశాతం ఉత్తీర్ణతతో పాటు 568 మార్కులు సాధించిన విద్యార్థినికి మహీంద్రా అండ్ మహీంద్రా వారి సౌజన్యంతో ప్రతిభ చాటిన విద్యార్థినికి నగదుతో పాటు ఘనంగా సత్కరించారు. గురువారం మండలంలోని హద్నూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థిని ఎం.తారుణ్య 568 మార్కులు సాధించిన నేపథ్యంలో.. జహీరాబాద్ మహీంద్రా అండ్ మహీంద్రా మేనేజర్ ఎం.అనిల్ కుమార్, మండల విద్యాధికారి మారుతి రాథోడ్ ల చేతుల మీదుగా విద్యార్థినికి కొంతమేర నగదును అందజేసి, సత్కరించి అభినందించారు. శతశాతం ఉత్తీర్ణతతో పాటు ట్రిబుల్ ఐటీ (బాసర) సీటు సాధించడం పట్ల పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులకు మండల విద్యాధికారి, కర్మాగారం యాజమాన్యం సంతోషం వ్యక్తం చేస్తూ అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, కర్మాగారం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోట్‌బుక్‌ల పంపిణీ



**అల్లాదుర్గం, జూలై 16 (జనంసాక్షి):** మండల పరిధిలోని చేవెళ్ల ప్రాథమికోన్నత పాఠశాలలో మాజీ ఎంపీపీ కాశీనాథ్ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్కులు, స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకొని తల్లి దండ్రులకు గ్రామానికి మంచి పేరు తీసుకురావాలనీ ఆకాక్షించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, మచ్చేందర్ ,పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనురాధ, ఉప సర్పంచ్, వడ్ల నాగప్ప, గ్రామ బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సంటప్ప, యూత్ ప్రెసిడెంట్ లక్ష్మణ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



**కోహెడ, జూలై 16 (జనంసాక్షి):** మండలంలోని విజంపల్లి గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద ప్రజలకు సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక భరోసా కల్పిస్తోంది. అలాగే రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ సహకారంతో అర్హులైన ప్రతిపేద కుటుంబానికి సీఎం సహాయనిధి ద్వారా ఆర్థిక సహాయం అందుతున్నదని తెలిపారు.ఈ సందర్భంగా వారికి ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమం లో చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బద్దం తిరుపతి రెడ్డి, పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు బద్దం రాజిరెడ్డి, ఉపసర్పంచ్ రంగనవేని వెంకటస్వామి, గర్రెపల్లి రవీందర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తపస్ ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం



**పెద్ద శంకరంపేట, జూలై 16 (జనంసాక్షి):** పెద్ద శంకరంపేట మండల తపస్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గురువారం పెద్ద శంకరంపేటలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల తపస్ అధ్యక్షుడు సత్య కుమార్ మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో తపస్ సంఘం నిరంతరం కృషి చేస్తుందన్నారు. తపస్ సంఘ సభ్యత్వ నమోదు తదితర కార్యాచరణ అంశాల పై చర్చించారు.. ఈ కార్యక్రమంలో తపస్ సంగం మండల బాధ్యులు ప్రవీణ్ కాన్షిరాం జాదవ్ సచిన్ కుమార్ లక్ష్మణ్, బి శ్రీనివాస్ అనురాధ ఉదయ్‌కుమార్ అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## పీఎం కిసాన్ కటాఫ్ తేది పెంచాలి... రైతులకు న్యాయం చేయాలి



**నారాయణపేట, జూలై 16(జనంసాక్షి):** దేశ వ్యాప్తంగా రైతులకు పెట్టుబడి సాయం అందించే పీఎం కిసాన్ సమ్మాన్ నిధికి దరఖాస్తు చేసుకోవ దానికి కటాఫ్ తేది పెంచి రైతులకు అవకాశం ఇవ్వాలని సామాజిక కార్య కర్త హెచ్.నర్సింహా కేంద్ర ప్రభుత్వానికి ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. పార్ల మెంట్ సమావేశంలో ఈ విషయాన్ని చర్చించి సన్నకారు, చిన్నకారు రైతులకు న్యాయం చేయాలని కోరారు.ఈ పథకంలో చేరుటకు కటాఫ్ తేది 2019 జనవరి 31 వరకు మాత్రమే ఇచ్చారు. ఆ తర్వాత పథకంలో చేరుటకు దరఖాస్తు చేసు కుందామంటే కటాఫ్ తేది పెంచలేదు. ఈ పథకం ప్రారంభము అయినప్పుడు 5సంవత్సరాల తర్వాత ఈ పథకంలో చేరుటకు అవకాశం ఇస్తామని చెప్పి ఇవ్వలేదు కావున అర్హత గల రైతులు పెట్టుబడి సాయం పొందలేక పోతున్నారు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అర్హత గల సన్నకారు, చిన్నకారు రైతులు ఈ పథకంలో చేరుటకు నిబంధనలు సడలించి కటాఫ్ తేది పెంచాలని కోరారు.

## కుటుంబ సభ్యులతో కలిసి ఓటరు నమోదు పత్రం పూర్తి చేసిన ఎస్ ఆర్ రెడ్డి



**నారాయణపేట, జూలై 16 (జనంసాక్షి):** నారాయణపేట మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్ రెడ్డి గురువారం ఓటర్ ఎన్యూమరేట్ ఫారాలను భర్తీ చేసి బిఎల్ ఓకు అందజేశారు. నారాయణపేట నియోజక వర్గంలోనీ కోయిల్‌కొండ మండలం తన స్వంత గ్రామం శేరివెంకటపూర్‌లో కుటుంబ సమేతంగా కలిసి బిఎల్ఓకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఆర్ రెడ్డి మాట్లాడుతూ ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరు గా నమోదు కావడం ప్రజాస్వామ్యానికి ఎంతో ముఖ్యమని అన్నారు. ఓటరు జాబితాలో పేరు నమోదు, ఎన్యూమరేషన్ దరఖాస్తు ప్రక్రియల్లో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాలని బిఎల్ఓలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దోపిడికి అడ్డగా మారిన కోచింగ్ సెంటర్లు.

- డిఇఓకు వినతిపత్రం
- బీఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు, జిల్లా కోఆర్డినేటర్ కురువ పల్లయ్య



**గద్వాల నడిగడ్డ,జూలై 16(జనంసాక్షి);** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయంలో జిల్లాలో అక్రమంగా నడుపుతున్న కోచింగ్ సెంటర్ల పైన చర్యలు తీసుకోవాలని డీఈవోకి గురువారం టిఆర్ ఎస్వి రాష్ట్రనాయకులు పల్లయ్య వినతి పత్రం అందజేశారు.

**ఈ సందర్భంగా బీఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు కురువ పల్లయ్య మాట్లాడుతూ**

గద్వాల జిల్లాలో అక్రమశిక్షణ కేంద్రాల దందా అనుమతులు లేవనీ,ఫైర్ సేఫ్టీ అసలే లేదనీ,నవోదయ గురుకుల సీట్ల ఆశ చూపి వేలలో వసూళ్లు చేస్తున్నారని,గొర్రెల మందల్ల విద్యార్థులు, గాలి వెలుతురు కరువనీ,జిల్లాలో కోచింగ్ మాఫియా రెచ్చిపోతుందనీ, అక్షరాల ముసుగులో అక్రమ దందాకు తెరలేపిన కొందరు నిర్వాహకులు నిబంధనలను గాలికి వదిలేసి కాసుల వేటలో పడ్డారనీ,నవోదయ గురుకుల ప్రవేశ పరీక్షల పేరిట ఎలాంటి అనుమతులు లేని ప్రైవేటు కోచింగ్ కేంద్రాలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయనీ, విద్యార్థుల భద్రతను గాలికి వదిలేసి నిలువు దోపిడీకి పాల్పడుతున్నారనీ, తమ పిల్లలకు నవోదయ గురుకుల పాఠశాలలో సీట్లు వస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్న పేద మధ్య తరగతి తల్లిదండ్రుల ఆశలే, ఈ మాఫియాకు పెట్టుబడనీ ,దీనిని ఆసరాగా చేసుకొని ఒక్కో విద్యార్థి నుంచి వేలాది రూపాయలు ముక్కు పిండి వసూలు చేస్తున్నారనీ, కనీసం మౌలిక సదుపాయాలు లేని ఇరుకైన రేకుల షెడ్లు అపార్ట్మెంట్లో వందలాది మంది విద్యార్థులను గొర్రెల మందల్ల కుక్కుతున్నారనీ, విద్యార్థి అడ్మిషన్ మాత్రం ప్రభుత్వ పాఠశాలల్లో, ప్రవేట్ పాఠశాలలో ఉంటుంది కానీ పిల్లవాడు మాత్రం కోచింగ్ సెంటర్లో ఉంటున్నాడనీ, విద్యాసంస్థలు కోచింగ్ సెంటర్లు నడపాలంటే విద్యాశాఖ అనుమతులతో పాటు ఫైర్ సేఫ్టీ మున్సిపల్ అధికారుల ఎన్‌ఓసి తప్పనిసరి కానీ గద్వాల జిల్లా కేంద్రంతో పాటు పలు మండలాల్లో నడుస్తున్న ఈ కేంద్రాలకు కనీస అనుమతులు లేవు అన్నది బహిరంగ రహస్యం అని,గాలి వెళ్తురు చొరబడని గదులు, అత్యవసర సమయంలో బయటకు వెళ్లేందుకు కనీసం ఎమర్జెన్సీ ఎగ్జిట్ లేని భవనాలలో శిక్షణ ఇస్తున్నారనీ ,ఏ చిన్న అగ్నిప్రమాదం జరిగినా పసిప్రాణాలకు గ్యారెంటీ ఇవ్వరు అన్నది ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న అని, తక్షణమే జిల్లా డీఈవో, జిల్లా కలెక్టర్ వాటి పైన కఠినమైన చర్యలు తీసుకొని వాటిని మూసివేయాలని డిమాండ్ చేస్తున్నామని పల్లయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో స్వామి, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు 3 వరకు "సర్" గడువు పొడిగింపు

• **జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్**



**మెదక్ బ్యూరో, జూలై16 (జనంసాక్షి):** రాష్ట్రంలో ఎన్నికల సంఘం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) షెడ్యూల్ గడువు ఆగస్టు మూడో తేదీ వరకు పొడగించినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. బూత్‌స్థాయి అధికారులు ఆగస్టు 3వ తేదీ వరకు ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు సేకరిస్తారని జిల్లా కలెక్టర్ అన్నారు. అర్హులైన ప్రతి ఓటరు, పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా, అనర్హుల పేర్లు తొలగించే ప్రక్రియను నిబంధనల మేరకు నిర్వహించాలని సూచించారు. ఇంటింటి సర్వే, ఫీల్డ్ వెరిఫికేషన్, దరఖాస్తుల పరిశీలన వంటి ప్రతి దశను అత్యంత జాగ్రత్తగా చేపట్టాలని తెలిపారు. బూత్‌స్థాయి అధికారులు తమ పరిధిలోని ప్రతి ఇంటిని సందర్శించి, ఓటర్ల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని, అందిన దరఖాస్తులను ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా సకాలంలో పరిష్కరించాలని గురువారం ఒక ప్రకటన తెలిపారు.

## రేజింతల్‌కు స్మశానవాటిక
## స్థలం కేటాయించాలి: సీపీఎం



**సదాశివపేట, జూలై 16 (జనంసాక్షి):** మండలంలోని రేజింతల్ గ్రామానికి తక్షణమే స్మశానవాటిక స్థలం కేటాయించాలని సీపీఎం సదాశివపేట ఏరియా కార్యదర్శి వి.ప్రవీణ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం గ్రామంలో ఇంటింటికీ తిరిగి సంతకాల సేకరణ చేపట్టారు.
గ్రామం ఏర్పడి ఎన్నో సంవత్సరాలు గడిచినా ఇప్పటికీ స్మశానవాటిక లేక పోవడం దురదృష్టకరమని ఆయన అన్నారు. సర్వే నంబర్ 149లో ఉన్న ప్రభుత్వ ఖాళీ భూమిని స్మశానవాటికగా కేటాయించాలని కోరారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు గ్రామ ప్రజలతో కలిసి ఉద్యమాన్ని కొనసాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్.రమేష్ గౌడ్‌తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

**కొండపాక, జులై 16 (జనంసాక్షి):** సిద్దిపేట జిల్లా, కొండపాక మండలం అంకిరెడ్డిపల్లి గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన తెలపాక కిష్టయ్య అనారోగ్యంతో మరణించినందున విషయం తెలుసుకున్న మాజీ జెడ్పిటిసి అనంతుల అశ్విని ప్రశాంత్ తెలుసుకొని సర్పంచ్ గాలి బాలయ్య సమక్షంలో వారి కుటుంబానికి 5000 రూపాయలు అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ సీనియర్ నాయకులు సోమని కనకయ్య తేలు యాదగిరి సనువాల ఆనందం, గ్రామ ప్రజలుతదితరులు పాల్గొన్నారు

## అప్రమత్తత లేకపోతే ప్రమాదమే..

• **వాటర్ హీటర్ షాక్‌తో 26 ఏళ్ల వివాహిత మృతి**



**మానవపాడు జులై 16(జనంసాక్షి):** కేంద్రంలో విషాదకర ఘటన చోటు చేసుకుంది. వాటర్ హీటర్‌లో కరెంట్ లీకేజీ కారణంగా 26 ఏళ్ల వివాహిత మంజుల భాయి మృతి చెందడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటన బుధవారం సాయంత్రం 7 గంటల సమయంలో జరిగింది. స్నానం చేయడానికి బాత్రూంకు వెళ్లిన మంజుల భాయి, వాటర్ హీటర్‌ను ఉపయోగించే సమయంలో ప్రమాదవశాత్తు కరెంట్ షాక్‌కు గురయ్యారు. తీవ్ర విద్యుత్ షాక్ తగలడంతో ఆమె అక్కడికక్కడే కుప్పకూలిపోయారు. ఆమె కేకలు విన్న కుటుంబ సభ్యులు వెంటనే బాత్రూం తలుపు తెరిచి బయటకు తీసుకొచ్చి, ప్రథమ చికిత్స అనంతరం మానవపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.
పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యుల సూచన మేరకు 108 అంబులెన్స్ ద్వారా కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

## బిఎల్ఓకు సన్మానం..



**నిజాంపేట, జులై 16 (జనంసాక్షి):** ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ ప్రక్రియలో భాగంగా నిజాంపేట మండలం నంద గోకుల్ గ్రామంలో మొట్టమొదటిసారిగా సర్వేను పూర్తిచేసిన బిఎల్ఓ అంతం జ్యోతిని తహసిల్దార్ శ్రీనివాస్, సర్పంచ్ భాను ప్రకాష్ రెడ్డిలు శాలువాతో సన్మానించారు. అనంతరం బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో బిఎల్ఓల పాత్ర కీలకమని, ప్రతి అధికారి నిబద్ధతతో తమ విధులు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలోకార్యదర్శి భాగ్యలక్ష్మి, ఉపసర్పంచ్ కుమార్, పాలకవర్గం సభ్యులు ఉన్నారు.

## మైసంపల్లిలో వర్షాలు కురువాలని
## గ్రామదేవతలకు జలాభిషేకం



**నంగునూర్, జులాయి 17 (జనంసాక్షి):** నంగునూరు మండలం, మైసంపల్లి గ్రామంలో వర్షాలు సమృద్ధిగా కురువాలని గురువారం రోజు గ్రామ దేవతలకు జలాభిషేకం నిర్వహించారు. అనంతరం మహిళలంతా కలిసి నీళ్ల బిందెల చుట్టూ బతుకమ్మ ఆటఆడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సోమిరెడ్డి నరేష్ రెడ్డి మాట్లాడుతూ వాన కాలం మొదలై రెండు నెలలు అవుతున్న వానలు పడకపోవడంతో గ్రామ దేవతలు శాంతించాలని జలాభిషేకం చేశామని వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని దేవుళ్ళను వేడుకున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు, గ్రామస్తులు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## రాయల చంద్రశేఖర్ ఆశయాలను
## కొనసాగిద్దాం



**నారాయణపేట, జూలై 16(జనంసాక్షి):** ఎలాంటి అంతరాలు లేని సమ సమాజం రావాలని తన జీవితాంతం కృషి చేసిన సిపిఐ (ఎమ్ఎల్) మాస్ లైన్ పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ ఆశయాలను ప్రతి ఒక్కరు కొనసాగించాలని సిపిఐ(ఎంఎల్) మాస్ లైన్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.హన్మేష్ పిలుపునిచ్చారు. కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ రెండో వర్ధంతి సందర్భంగా స్థానిక భగత్‌సింగ్ భవన్‌లో గురువారం ఆయన చిత్రపటానికి పూలమాలతో నివాళులు అర్పించారు. తన చదువును కూడా మధ్యలో వదిలేసి ఉద్యమం బాటపట్టాడనీ ఈ క్రమంలో రాజ్యం చేత అనేక నిర్భందాలు, ప్రయివేటు గుండాల చేత బెదిరింపులు ఎదుర్కొన్నాడన్నారు. అయినా ఎక్కడ చలించకుండా పేదల కోసం, కార్మిక వర్గం కోసం తన జీవితాన్ని అంకితం చేశాడనీ తెలిపారు. పార్టీని ముందుకు తీసుకెళ్లడంలో తనవంతు కృషిచేశాడనీ అటువంటి వ్యక్తిని మనమందరం స్ఫూర్తిగా తీసుకోని సమసమాజ స్థాపనలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సలీం, కె.కాశినాథ్, బోయిన్‌పల్లి రాము, ఎస్.కిరణ్ బి.యాదగిరి, పి.రామకృష్ణ, బి.నర్సింహా, భగవంతు, కొండ నర్సిములు, ఛన్నారెడ్డి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## నాడు నేడు .. కొలువు దీరాక

• **మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు**





**పాపన్నపేట, జూలై 16 (జనంసాక్షి):** పదేండ్ల క్రితం నాడు నేడు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరాక అన్ని రంగాల్లో అభివృద్ధి దిశగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు పేర్కొన్నారు. గురువారం మండల పరిధి లోని పొడ్చన్ పల్లిలో మత్స్యకార సంఘం సభ్యులకు సభ్యత్వ గుర్తింపు కార్డులు అందజేశారు. గ్రామంలో వీధిలైట్లను ప్రారంభించారు. అనంతరం పాపన్నపేట మండల పరిషత్ సమావేశ మందిరంలో వివిధ గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ చెక్కులను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. ఉచిత విద్యుత్,బస్సు ప్రయాణం,సన్న బియ్యం,రైతులకు రుణమాఫీ కాంగ్రెస్ ప్రభుత్వం తోనే సాధ్యపడిందని స్పష్టం చేశారు. నాడు నేడు కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామాలలో పేద ప్రజలకు ఇండ్లు మంజూరు చేశామన్నారు. గత ప్రభుత్వం పల్లెల్లో పేదలకు ఇండ్లు ఇస్తామని మాయ మాటలు చెప్పి మోసం చేసిందని విమర్శించారు. ఈకార్యక్రమంలో తహశీల్దార్ సతీష్ కుమార్,మత్స్యశాఖ అధికారిణి బి.పూర్ణిమ,సర్పంచుల ఫోరమ్ అధ్యక్షుడు వెంకటేశం,కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు నరేందర్ గౌడ్,మెదక్ పురపాలక ఉపాధ్యక్షుడు నరేష్ గౌడ్, సర్పంచులు పావని గౌడ్, పద్మ రమేష్, శేఖర్, ఏసు, నాయకులు.. ప్రభాకర్ రెడ్డి,మల్లప్ప,ఖలీమ్,కిష్టయ్య,గౌస్,సూఫీ,శివయ్య,ప్రవీణ్ గౌడ్ తదితరులు ఉన్నారు.

## ద్విచక్ర వాహనం అదుపుతప్పి
## కిందపడిన సంఘటనలో మహిళ మృతి కేసు నమోదు

**గట్టు, జులై 16 (జనంసాక్షి);** గట్టు మండలం బలిగెర గ్రామంలో పొలం దగ్గర నుండి ద్విచక్ర వాహనంపై తల్లి,కుమారుడు ఇంటికి వస్తుండగా వాహనం అదుపు తప్పడంతో కింద పడిన సంఘటనలో తల్లి మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని బలిగెర గ్రామంలో బుధవారం సాయంత్రం చోటు చేసుకున్నది. ఈ సంఘటనకు సంబంధించి ఎస్సై శేఖర్ గౌడ్ అందించిన వివరాల ప్రకారం. బలిగేర గ్రామానికి చెందిన నర్సమ్మ(52) ఈమె పెద్ద కుమారుడు బసప్ప ఇద్దరు పొలం పనులు ముగించుకొని ఇంటికి వస్తుండగా బలిగిర గ్రామ సమీపంలో ద్విచక్ర వాహనం FZ (TS 33T 5565) అదుపుతప్పి కిందపడ్డారు. ఈ సంఘటనలో తల్లి నరసమ్మ తలకు బలంగా గాయాలు కావడంతో ఈమెను చికిత్స నిమిత్తం ఐజ ఆసుపత్రికి తరలించారు. అనంతరం డాక్టర్ల సలహా మేరకు మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు ఈ సంఘటనపై కుమారుడు ముకయ్య గాళ్ళ భీమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## అమరచింతలో
## ఎస్బిఐ బ్యాంక్ ఏర్పాటుకు ఎస్‌బిఓ అధికారులు సర్వే



**అమరచింత, జూలై 16 (జనంసాక్షి):** అమరచింత మున్సిపాలిటీ కేంద్రంలో ఎస్బిఐ బ్యాంక్ ఏర్పాటు కోసం గురువారం జోగులాంబ గద్వాల ఎస్బిఓ కామాష్, ఆత్మకూరు ఎస్బిఐ మేనేజర్ శ్రీనివాసులు, యూనియన్ బ్యాంక్ మేనేజర్ రామకృష్ణతో చర్చలు జరిపారు. అమరచింతలో ఎస్బిఐ బ్యాంకు ఏర్పాటుకు తమకు ఎలాంటి అభ్యంతరం లేదని యూనియన్ బ్యాంక్ మేనేజర్ రామకృష్ణ ఎస్‌బిఓ అధికారి కామేష్, ఎస్బిఐ బ్యాంక్ మేనేజర్‌కు చెప్పడం జరిగింది. అనంతరం మాదన్న కాంప్లెక్స్ భవనాన్ని పరిశీలించారు. ఈ యొక్క కార్యక్రమంలో పాల్గొన్నవారు అమరచింత డెవలప్ మెంట్ నాయకులు అక్కల నరసింహులు గౌడ్, ఎం, అశోక్ కుమార్, ఏ రఘు, ఏ రవికుమార్, కే వెంకటస్వామి, కొంగరి భాస్కర్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య యోధులకు కళ్లద్దాల పంపిణీ

## సొంత ఖర్చుతో కళ్లద్దాలు అందించిన మనోహర్ ప్రసాద్



**అచ్చంపేట, జులై 16, (జనంసాక్షి):** పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతున్న మున్సిపల్ పారిశుద్ధ కార్మికులకు తాజా మాజీ కౌన్సిలర్, పబ్లిక్ క్లబ్ ప్రధాన కార్యదర్శి కానోజు మనోహర్ ప్రసాద్ (మన్ను పటేల్) తన సొంత ఖర్చుతో కళ్లద్దాలు అందజేసి అందరికీ ఆదర్శప్రాయంగా నిలుస్తున్నారు. చూపు సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కార్మికులకు ఇటీవల పబ్లిక్ క్లబ్ అచ్చంపేటలో నిర్వహించిన ఉచిత నేత్ర పరీక్షా శిబిరంలో పరీక్షలు చేయించగా, వైద్యుల సూచనల మేరకు అవసరమైన కళ్లద్దాలను కొనుగోలు చేసి వారికి బహుకరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, కరోనా మహమ్మారి కాలం నుంచి ఇప్పటి వరకు కానోజు మనోహర్ ప్రసాద్ నిరుపేదలు, కార్మికులు, సామాన్య ప్రజలకు అండగా నిలుస్తూ సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగించడం అభినందనీయమని కొనియాడారు. సమాజ సేవలో ఆయన చూపుతున్న చొరవ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పిలిహరిచంద్ర, తాజా మాజీ కౌన్సిలర్ గౌరీశంకర్, శ్రీవాణి ఆప్టికల్స్ నిర్వాహకులు లింగారెడ్డి, పబ్లిక్ క్లబ్ సభ్యులు మేరె శివ, నాంసాని శ్రీనివాసులు, మున్సిపల్ పారిశుద్ధ కార్మికులు పాల్గొన్నారు.

# పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వాలి



- కొత్త విద్యుత్ చట్టాన్ని రద్దు చేయాలి
- ఆగష్టు 10న జైల్ భరోను జయప్రదం చేయండి
- రైతు సంగం జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి జయరాజు

**సంగారెడ్డి, జులై 16 (జనంసాక్షి):** రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వాలని, స్వామినాధన్ సిఫార్సులు అమలు చేయాలనీ రైతుసంగం జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి జయరాజు అన్నారు. గురువారం రైతుసంగం ఆధ్వర్యంలో సుందరయ్య భవన్‌లో ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా వచ్చిన లేబర్ కోడ్‌ను వెంటనే రద్దు చేయాలనీ డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీబి గ్రామ్ జి చట్టనిరద్దు చేసి మహాత్మా గాంధీ పాత చట్టాన్ని అమలు చేయాలనీ అన్నారు. రైతుల పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలని అన్నారు. ప్రభుత్వం కొత్తగా తెచ్చిన విద్యుత్ రద్దు చేయాలనీ అన్నారు. రైతులు, కార్మికులు, కూలి లకు వ్యతిరేకంగా తెస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఆగష్టు 10న జైల్ భరోను జయప్రదం కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు, కార్మికులు, కూలిలు పెద్దఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంగం జిల్లా కార్యదర్శి రమేష్ గౌడ్, ఉపాధ్యక్షులు యన్.శ్రీనివాస్, నాయకులు యాద గౌడ్, బాలరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి పోలీస్ క్రీడల్లో మెదక్ జిల్లాకు కాంస్య పతకం

- రెజ్లింగ్‌లో కాంస్యం సాధించిన కానిస్టేబుల్ రమేష్‌ను అభినందించిన జిల్లా ఎస్పీ



**మెదక్ బ్యూరో, జులై 16 (జనంసాక్షి):** విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటుతూ జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమని జిల్లా ఎస్పీ డివి శ్రీనివాసరావు అన్నారు. 5వ రాష్ట్ర స్థాయి పోలీస్ స్పోర్ట్స్‌మీట్‌లో రెజ్లింగ్ విభాగంలో కాంస్య పతకం సాధించి మెదక్ జిల్లాకు కీర్తి తీసుకొచ్చిన కానిస్టేబుల్ రమేష్‌ను జిల్లా ఎస్పీ అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ రమేష్‌కు శాలువా కప్పి సన్మానించి అభినందనలు తెలిపారు. విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటుతూ జిల్లా పోలీసు శాఖకు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో మరిన్ని రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని మెదక్ జిల్లా పోలీసు శాఖకు మరిన్ని పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. పోలీసు సిబ్బంది శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంలో క్రీడలు కీలక పాత్ర పోషిస్తాయని ఎస్పీ అన్నారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు శైలేందర్, రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

# అక్రమ ఇసుక రవాణాపై బెజ్జంకి పోలీసుల కొరడా





- ట్రాక్టర్,ట్రైలర్ స్వాధీనం
- ఓనర్, డ్రైవర్‌పై కేసు నమోదు
- అక్రమ ఇసుక రవాణాదారులపై కఠిన చర్యలు
- ఎస్సై తోట తిరుపతి

**బెజ్జంకి,జులై 16,(జనంసాక్షి):** బెజ్జంకి మండల పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమ ఇసుక తవ్వకాలు,రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నామని ఎస్ఐ టి.తిరుపతి తెలిపారు.ఈ మేరకు గురువారం గగ్గిల్లాపూర్ స్టేజ్ వద్ద నిర్వహించిన వాహన తనిఖీల్లో ట్రాక్టర్ నంబర్(టీఎస్ 22 టీ 4364),ట్రైలర్ నంబర్(టీఎస్ 22 టీ 7178) గల వాహనంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు.విచారణలో తోటపల్లి గ్రామానికి చెందిన డ్రైవర్ గొల్ల రాజ్‌కుమార్(29),వాహన యజమాని ఉల్లి నరేష్(40)ఆదేశాల మేరకు తోటపల్లి గ్రామ శివారులోని మొయతుమ్మెద వాగు నుంచి ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుకను లోడ్ చేసి రోడ్డు మార్గంలో తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడించారు.దీంతో ట్రాక్టర్,ట్రైలర్‌ను స్వాధీనం చేసుకుని,డ్రైవర్‌తో పాటు వాహన యజమానిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.అనంతరం ఎస్సై తోట తిరుపతి మాట్లాడుతూ ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తవ్వడం,నిల్వ చేయడం,రవాణా చేయడం చట్టవిరుద్ధమని,ఇటువంటి అక్రమ కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.అక్రమ ఇసుక తవ్వకాలు,రవాణాకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే బెజ్జంకి పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100కు సమాచారం అందించి పోలీసులకు సహకరించాలని ఎస్ఐ టి.తిరుపతి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.అక్రమ ఇసుక రవాణా సమాచారం అందించిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని ఎస్సై.తిరుపతి అన్నారు.

# మంజీరా నదిలో దిగడానికి ఎవ్వరు సాహసించరాదు

- హద్నూర్ పోలీస్ వారి హెచ్చరిక



**న్యాల్‌కల్, జూలై 16, (జనంసాక్షి):** న్యాల్‌కల్ మండలం, చాల్కి - రాఘవాపూర్ గ్రామాల శివారులోని మంజీరానదిలో దిగేందుకు ఎంతటి వారైనా సాహసించరాదని స్థానిక ఎస్సై సుజిత్ హెచ్చరిక జారీచేశారు. ఇటీవల ప్రమాదకరంగా, ఉద్దేశపూర్వకంగా మంజీరా నదిలో గల్లంతై మృత్యువాత పడుతున్న సంఘటనల నేపథ్యంలో.. గురువారం ఎస్సై ఆదేశం మేరకు స్థానిక పోలీసులు మంజీరా నది తీరాన హెచ్చరిక సూచికను ఏర్పాటు చేశారు. నదిలో నీరు తక్కువగా ఉన్నప్పటికిని.. నదిలోని పలుచోట్ల జెసిబిల ద్వారా తవ్వకాలు జరిగిన నేపథ్యంలో ప్రమాదకర గుంతలు ఉన్నాయని, వాటిని గుర్తించక ప్రమాదాల బారిన పడి మృత్యువాత పడుతున్నారని ఎస్సై సూచించారు. వ్యక్తులు ఎవరైనా ఎట్టి పరిస్థితుల్లో నదిలోకి వెళ్లేందుకు సాహసించకూడదని హెచ్చరించారు. ఏమాత్రం నిర్లక్ష్యం వహించిన మూల్యం తప్పదని పేర్కొన్నారు. ఈ మేరకు ప్రతి ఒక్కరు పోలీసులకు సహకరించాలని కోరారు.

# బొంతపల్లి వీరభద్ర స్వామి దేవస్థానం పాలకవర్గం ఏర్పాటుకు నోటిఫికేషన్

- జూలై 20 వరకు దరఖాస్తుల స్వీకరణ: ఎండోన్మెంట్ శాఖ ప్రకటన

**గుమ్మడిదల, జూలై 16 (జనంసాక్షి):** గుమ్మడిదల మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన బొంతపల్లి శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానం నూతన పాలకవర్గం (ట్రస్ట్ బోర్డు) ఏర్పాటుకు ఎండోన్మెంట్ శాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆలయ పాలనలో భాగస్వామ్యం కావాలనుకునే అర్హులైన భక్తులు, ప్రజాప్రతినిధులు మరియు ఇతర అర్హత కలిగిన వ్యక్తులు జూలై 20వ తేదీలోపు సంగారెడ్డి జిల్లా ఎండోన్మెంట్ కార్యాలయంలో దరఖాస్తులు సమర్పించాలని అధికారులు సూచించారు.

ప్రభుత్వ మార్గదర్శకాలు, దేవాదాయ శాఖ నిబంధనల ప్రకారం అందిన దరఖాస్తులను పరిశీలించి అర్హులైన వారితో కొత్త పాలకవర్గాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఎండోన్మెంట్ అధికారులు తెలిపారు. దరఖాస్తుతో పాటు గుర్తింపు పత్రాలు, అర్హతకు సంబంధించిన ధ్రువపత్రాలు, ఇతర అవసరమైన పత్రాలను తప్పనిసరిగా జతచేయాలని పేర్కొన్నారు. గడువు అనంతరం వచ్చే దరఖాస్తులను పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు. ప్రతి ఏడాది వేలాది మంది భక్తులు దర్శించుకునే బొంతపల్లి శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానానికి కొత్త పాలకవర్గం ఏర్పాటు కానుండటంతో స్థానిక ప్రజలు, భక్తుల్లో ఆసక్తి నెలకొంది. కొత్త ట్రస్ట్ బోర్డు బాధ్యతలు చేపట్టిన తర్వాత ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు భక్తులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న తాసిల్దార్ రవికుమార్



**అమరచింత, జూలై16 (జనంసాక్షి):** సర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని తాసిల్దార్ రవికుమార్ అన్నారు. గురువారం అమరచింత పట్టణ కేంద్రంలో 9వ వార్డులో ఆర్ఐ బిఎల్వోలు ఇంటింటికి వెళ్లి యానిమరేషన్ ఫామ్స్ తీసుకొని పారాలను నింపడం జరిగింది. అట్టి ఓటు నమోదు ప్రక్రియను తాసిల్దార్ పరిశీలించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ ఆర్ఐ బిఎల్వోలతో మాట్లాడుతూ వార్డుల వారీగా అధికారులు బిఎల్ఓలు ఏ ఒక్క ఓటు నమోదు మిస్‌కాకుండా చూసుకోవాలని అలాగే ప్రతి ఒక్కరు ఓటును ఓటు కాపాడుకోవాలని సూచనలు ఇచ్చారు. సర్ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం పొడిగించడంతో పట్టణ ప్రజలు తమ ఓటు ను నమోదు చేసుకోగలరని తాసిల్దార్ అన్నారు. ఈ యొక్క కార్యక్రమంలో వార్డ్ ఆఫీసర్ సిబ్బంది పాల్గొన్నారు.

# చాకల్‌పల్లిలో ఓటర్ ఎన్యూమరేషన్ ఫారాల అందజేత



**గోపాలపేట, జూలై 16 (జనంసాక్షి):** చాకల్‌పల్లి గ్రామంలో పంచాయతీ కార్యదర్శి పార్వతి, బీఎల్ఓ నారాయణకు భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు, బీఎల్ఏ రాకాసి అరవిందరెడ్డి ఓటర్ ఎన్యూమరేషన్ ఫారాలను అందజేశారు.

ఈ సందర్భంగా మండలంలో ఓటర్ ఎన్యూమరేషన్ ఫారాల సమర్పణలో చాకల్‌పల్లి గ్రామం మొదటి స్థానంలో నిలవడం పట్ల పంచాయతీ కార్యదర్శి పార్వతి, బీఎల్ఓ నారాయణలను ఆయన అభినందించారు. ఓటరు జాబితా ప్రక్రియను విజయవంతం చేయడంలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఏసోపు, ఆశా కార్యకర్త అలివేలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి రవాణా కేసులో పరారీలో ఉన్న నిందితుడు అరెస్ట్



**తూప్రాన్, జూలై 16(జనంసాక్షి):** తూప్రాన్ పోలీస్ స్టేషన్ పరిధిలో తేదీ 23.10.2025 నమోదైన గంజాయి అక్రమ రవాణా కేసులో పరారీలో ఉన్న నిందితుడు జహంగీర్ ఖాన్ (38), పట్టేపల్లి, ఫలక్‌నుమా, హైదరాబాద్ ను తూప్రాన్ పోలీసులు ఎస్సై గంగరాజు తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం, నిందితుడు గతంలో చిన్నచిన్న దొంగతనాలకు పాల్పడుతూ అనంతరం గంజాయి అక్రమ రవాణా విక్రయాల్లోకి చేస్తుండేవారు హైదరాబాద్‌కు చెందిన పలువురుతో కలిసి నాగ్‌పూర్ నుండి సుమారు 50 కిలోల గంజాయిని కొనుగోలు చేసి, అద్దెకు తీసుకున్న మారుతి ఎర్టిగా కారు హైదరాబాద్‌కు తరలించే ప్రయత్నం చేసినట్లు విచారణలో వెల్లడించాడు. గత సంవత్సరం అక్టోబర్ 22న రాత్రి తూప్రాన్ టోల్ ప్లాజా వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా, నిందితులు ప్రయాణిస్తున్న కారు వేగంగా పారిపోవడానికి ప్రయత్నించి టోల్ బారియర్‌ను ఢీకొట్టి బోల్తా పడింది. ఈ ఘటనలో కొందరు నిందితులు పోలీసులకు చిక్కగా, జహంగీర్ ఖాన్ సహా మరికొందరు పరారయ్యారు.

పరారీలో ఉన్న జహంగీర్ ఖాన్ ఇటీవల మరో గంజాయి కేసులో అరెస్టై జైలుకు వెళ్లి, సుమారు 12రోజుల క్రితం విడు దలైనట్లు పోలీసుల విచారణలో తెలిసింది. తిరిగి నాగ్‌పూర్ వెళ్లి గంజాయి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్న సమయంలో జూలై 16న తూప్రాన్ శివారులోని ఓ ధాబా వద్ద పోలీసులు అతడిని అదుపులోకి తీసు కున్నారు. నిందితుడిని చట్టపరమైన ప్రక్రియ అనంతరం న్యాయస్థానం ఎదుట హాజరు పరుస్తామని పోలీసులు తెలిపారు. ఈ కేసులో మిగిలిన అంశాలపై దర్యాప్తు కొనసాగుతోంది. గంజాయి వంటి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై సమాచారం తెలిసిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్-100కు సమాచారం అందించాలని కోరారు. ఈ కేసును విజయవంతంగా ఛేదించిన పోలీసు బృందాన్ని డీఎస్పీ తూప్రాన్ . నరేందర్ గౌడ్ పర్యవేక్షణలో, సీఐ తూప్రాన్ వెంకట రాజా గౌడ్ ఆధ్వర్యంలో ఎస్ఐ వి. గంగ రాజు, హెడ్ కానిస్టేబుల్ ఎల్లయ్య , కానిస్టేబుళ్లు క్రిష్ణ, సురేష్ రవి, సతీష్ సమర్థవంతంగా పని చేసి నిందితుడిని అరెస్ట్ చేశారు. వారి కృషిని మెదక్ జిల్లా పోలీసు అధికారి గౌరవ శ్రీనివాసరావు అభినందిస్తూ తగిన రివార్డు ప్రకటించారు.

## నేడు చేర్యాలలో విస్తృతంగా పర్యటించనున్న ఎంపీ చామల

• రూ.4 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు




చేర్యాల, జూలై16 (జనంసాక్షి): చేర్యాల మండలంలో నేడు భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి అధికారికంగా విస్తృత పర్యటన చేయనున్నారు. ఈ పర్యటనలో భాగంగా శుక్రవారం మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో సుమారు రూ. 4కోట్ల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన భవనాలను ప్రారంభించనున్నారు. అందులో ముఖ్యమైన ఆకునూర్ గ్రామంలో రూ.50లక్షలు, రాంపూర్ గ్రామంలో రూ. 10 లక్షల వ్యయంతో నిర్మించిన భవనాల ప్రారంభోత్సవం, చేర్యాల మండల కేంద్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూ.2.30 కోట్ల వ్యయంతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ భవనాలతోపాటు స్వయం సహాయక సంఘాల భవనాలు ప్రారంభించనున్నారు.

## పేదోడికి బాసటగా ముఖ్యమంత్రి సహాయ నిధి



కొత్తపల్లి, జూలై 16 (జనంసాక్షి): పేదవాడికి అండగా నిలిచిన రాష్ట్ర ముఖ్య మంత్రి నేడు అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ కింద ఆర్థిక సహాయాన్ని అందిస్తూ దానిలో భాగంగా కొత్తపల్లి మండలంలోని దుప్పటి గట్టు గ్రామంకు చెందిన గండికుంట సత్యమ్మ భర్త భగవంతు కు ముఖ్యమంత్రి సహాయనిధి కింద 60000 రూపాయలు మం జూరు చేయడం జరిగింది. ఈ చెక్కును గ్రామ సర్పంచ్ వెంకటయ్య యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు నరేష్ యాదవ్ వారికి అందజేయడం జరిగింది.

## అంగన్‌వాడీ చిన్నారులకు యూనిఫామ్‌ల పంపిణీ



మల్దకల్, జూలై 16(జనంసాక్షి): మండల పరిధిలోనినాగర్ దొడ్డి గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలోని గురువారం చిన్న పిల్లలకు ప్రభుత్వం అందించిన ఉచిత యూనిఫామ్‌ల దుస్తుల పంపిణీ ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కె.వెంకటేశ్వరమ్మ పాల్గొని,చిన్నారులకు తమ చేతుల మీదుగాయూనిఫామ్‌లను అందజేశారు.యూనిఫామ్స్ ధరించిన బుజ్జాయిలను చూసి సర్పంచ్ మురిసిపోతూ,అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారంతో పాటు మంచి పునాది విద్య అందుతుందని లక్ష్మీదేవుల లాంటి పిల్లలను అంగన్‌వాడీకి పంపాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ జార్జి,గ్రామవార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు వనజాక్షి,ఆయా సిబ్బంది,గ్రామ పెద్దలు సత్యన్న, యువకులు చిన్నారుల తల్లిదండ్రులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉప్పునుంతలలో ఐదుగురిపై వీధికుక్క దాడి

ఉప్పునుంతల, జూలై 17 (జనంసాక్షి): ఉప్పునుంతల గ్రామంలో శుక్రవారం వీధికుక్క దాడిలో ఐదుగురు గాయపడ్డారు. సమాచారం అందుకున్న గ్రామ సర్పంచ్ చింతగల శ్రీనివాసులు వెంటనే బాధితులను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

అనంతరం ఉప్పునుంతల సామాజిక ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ వాణి ఆధ్వర్యంలో బాధితులకు అవసరమైన వైద్య చికిత్స అందించారు. కుక్క కాటుకు సంబంధించిన యాంటీ రేబిస్ టీకాలు, ఇతర వైద్య సేవలు అందించినట్లు వైద్యులు తెలిపారు.

ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చింతగల శ్రీనివాసులు మాట్లాడుతూ, గ్రామంలో వీధికుక్కల సమస్యను నివారించేందుకు సంబంధిత అధికారులతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామ ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



## ఘోర రోడ్డు ప్రమాదం

• స్కూల్ బస్సు,కార్ ఢీకొని ఇద్దరి పరిస్థితి విషమం
• స్కూల్ పిల్లలకు స్వల్ప గాయాలు

గుండుమాల్, జూలై 16(జనంసాక్షి): గుండుమాల్ మండలం బోగారం గ్రామం దర్గా సమీపంలోని కోస్గి నుండి గుండుమాల్ వైపు వెళుతున్న శాంతినికేతన్ స్కూల్ బస్, కోస్గి వైపు వెళుతున్న స్విఫ్ట్ ఏపీ 36 ఏబీ 7092 కార్ ఢీ కొనడంతో కార్ లో ఉన్న ఇద్దరి వ్యక్తులకు తీవ్ర గాయాలై, వాళ్ల పరిస్థితి విషమంగా ఉందని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి పోలీసులకు, 108 అంబులెన్స్ కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తీవ్రంగా గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. వీరు కొడంగల్ ప్రాంతానికి చెందినవారని సమాచారం. వాళ్ల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. స్కూల్ బస్ పెద్దగా డ్యామేజ్ కాలేదని బస్ లో ఉన్న పిల్లలకు స్వల్ప గాయాలు అయ్యాయి అని సమాచారం. కోస్గి పోలీసులు దర్యాప్తు చేస్తున్నాము అని తెలిపారు.

## గండీడ్‌లో పట్టపగలు చోరీ..

• బంగారం,వెండి,నగదు అపహరణ

గండీడ్, జూలై16 (జనంసాక్షి): గండీడ్ మండల గురువారం పట్టపగలు చోరీ జరిగింది. స్థానికంగా నివాసముంటున్న సంగ్రస్ వెంకటరాములు గౌడ్, ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తుతెలియని దుండగులు తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు.ఇంట్లోని సుమారు ఆరున్నర తులాల బంగారం,27 తులాల వెండి ఆభరణాలు,రూ. 30వేల నగదు, ఒక సెల్ ఫోన్‌ను అపహరించి పరారయ్యారు. కుటుంబ సభ్యులు ఇంటికి చేరుకుని చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకొని చోరీ ఏ కోణంలో జరిగిందో పోలీసులు పరిశీలించారు. బాధితుడు వెంకటరాములు గౌడ్ భార్య యాదమ్మ, ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శేఖర్ రెడ్డి తెలిపారు.

## పిల్లల విద్యాభివృద్ధే లక్ష్యం



మహమ్మదాబాద్, జూలై16(జనంసాక్షి): మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను మండల విద్యాధికారి ఎం.రాజునాయక్ మంగళవారం పర్యవేక్షించారు. బొమ్మకుంట తాండా, ధర్మాపూర్, కొలింపల్లి, వెంకటరెడ్డిపల్లి ఉన్నత ప్రాథమిక పాఠశాలలను సందర్శించి విద్యా బోధన, విద్యార్థుల హాజరు, పాఠశాల నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులంతా సమయపాలన పాటిస్తూ..ప్రతి విద్యార్థి అన్ని సామర్థ్యాలు సాధించేలా బోధన అందించాలని సూచించారు. (బొమ్మకుంట తాండా పాఠశాలలో బోధనోపకరణాల వినియోగంతో బోధన సమర్థవంతంగా సాగుతుండటంపై సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే సొంత ఖర్చులతో విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు మహాలక్ష్మి, ఉపాధ్యాయుడు నాగరాజును ప్రత్యేకంగా అభినందించారు. విద్యాశాఖ ఆదేశాలకు అనుగుణంగా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని మండల విద్యాధికారి తెలిపారు.

## విద్యుత్ షాక్ మృతుడి కుటుంబానికి భరోసా పరామర్శించిన ఎమ్మెల్యే డా.చిక్కుడు వంశీకృష్ణ



ఉప్పునుంతల, జూలై 17 (జనంసాక్షి): ఉప్పునుంతల మండలంలోని తిప్పాపూర్ గ్రామానికి చెందిన రాజపుత్ర వెంకటేశ్వర్ విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందిన విషయం తెలుసుకున్న అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ శుక్రవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు.. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పిన ఎమ్మెల్యే, ప్రభుత్వం నుంచి అందాల్సిన ఎక్స్‌గ్రేషియా (పరిహారం)తో పాటు ఇతర ఆర్థిక సహాయాలు త్వరగా అందేలా సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అలాగే మృతుడి పిల్లల భవిష్యత్తుకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు కట్ట అనంతరెడ్డి ఉప్పునుంతల సర్పంచ్ చింతగల శ్రీనివాసులు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు యువ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పైసలిస్తే పార్కింగ్ స్థలం ఉంటుంది..

• భక్తులపై ఉమామహేశ్వరం ఆలయ కార్యనిర్వహణాధికారి నిర్లక్ష్యం



అచ్చంపేట, జూలై 16 (జనంసాక్షి): శ్రీశైల ఉత్తర ద్వారమైన ఉమామహేశ్వరం ఆలయానికి వచ్చే భక్తులు పలు సమస్యతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆలయ పరిసరాల్లో కొండపైన ఉచిత పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో, వాహనాలను నుంచి వాహనానికి 500 రూపాయల చొప్పున డబ్బులు బహటంగా వసూలు చేస్తున్నారు.దూర ప్రాంతాల నుంచి స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులు తప్పనిసరిగా కొండపైకి వెళ్లాలంటే వాహనానికి 500 ప్రతి ఒక్కరికి 50 రూపాయలు చొప్పున చెల్లింపు పరిస్థితి ఏర్పడిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సరైన నిర్వహణ, భద్రతా ఏర్పాట్లు, స్పష్టమైన సూచిక బోర్డులు లేకపోవడం వల్ల మరిన్ని ఇబ్బందులు ఎదురవుతున్నాయని . ఆలయ నిర్వహణ అధికారి శ్రీనివాసరావు తను ఆడింది ఆట పాడింది పాట అనే విధంగా వ్యవహరిస్తున్నారని దర్శనానికి ఒకరికి పది రూపాయల చొప్పున వసూలు చేస్తున్నారని గత సంవత్సరం ఉన్న ఆలయ కమిటీ బోర్డులను అలాగే ఉంచారని నూతన కమిటీని ఏర్పాటు చేసిన ఆలయం ముందు బోర్డు మార్చకుండా ఉండటం భక్తులకు ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది పై విషయమై ఆలయ కార్య నిర్వహణ అధికారి తో ఫోన్లో మాట్లాడగా నేను కోర్టు పనిమీద హైదరాబాదులో ఉన్నానని చెప్పారు

## సోనమ్ వాంగ్‌చుక్ ఉద్యమానికి మద్దతు



అయిజ, జూలై 16 (జనంసాక్షి): తెలంగాణ రాజ్యాధికార పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని జూలై 20 'చలో సంసద్' కార్యక్రమానికి ప్రజలు, విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున పాల్గొనాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షులు మొరుగువీరేష్ తెలిపారు. సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన శాంతియుత ప్రజాస్వామ్య ఉద్యమానికి తెలంగాణ రాజ్యాధికార పార్టీ, జోగులాంబ గద్వాల జిల్లా కమిటీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్లు జిల్లా అధ్యక్షులు మొరుగు వీరేశ్ తెలిపారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర అధ్యక్షులు తీన్మార్ మల్లన్న ఆదేశాల మేరకు నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ప్రజల సమస్యలను వినడం, వాటిపై ప్రభుత్వం బాధ్యతాయుతంగా స్పందించడం ప్రతి ప్రజాస్వామ్య ప్రభుత్వానికి ప్రాథమిక బాధ్యత అని పేర్కొన్నారు. భారతదేశ ప్రజాస్వామ్య చరిత్రలో నిరాహార దీక్షలు ప్రజల న్యాయమైన ఆకాంక్షలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే అహింసా మార్గంగా నిలిచాయని ఆయన అన్నారు. మహాత్మా గాంధీ, పొట్టి శ్రీరాములు వంటి మహనీయుల ఉద్యమాలు ప్రజాస్వామ్య చరిత్రలో చిరస్థాయిగా నిలిచాయని గుర్తు చేశారు. ప్రస్తుతం లడఖ్ ప్రజల రాజ్యాంగ హక్కులు, పర్యావరణ పరిరక్షణ, స్థానిక ప్రజల నిర్ణయాధికారం వంటి అంశాలపై సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన ఉద్యమం కూడా ప్రజాస్వామ్య పరిధిలోనే కొనసాగుతోందని పేర్కొన్నారు. సోనమ్ వాంగ్‌చుక్ లేవనెత్తుతున్న డిమాండ్లలో దేశ విభజన లేదా రాజ్యాంగ వ్యతిరేక అంశాలు ఏవీ లేవని, ప్రజాస్వామ్య పద్ధతిలో తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్న వారితో కేంద్ర ప్రభుత్వం వెంటనే చర్చలు ప్రారంభించి పరిష్కార మార్గాలను అన్వేషించాలని మొరుగు వీరేశ్ కోరారు. చరిత్ర చెబుతున్న పాఠాలను విస్మరించకుండా, ప్రజల ఆవేదనను సమయానికి వినడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు.

## డ్రగ్స్ నిర్మూలనకు ఆకస్మిక తనిఖీలు: సీఐ శివశంకర్



**నారాయణపేట, జూలై 16 (జనంసాక్షి):** జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్, ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా కేంద్రంలో డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాల నిర్మూలనలో భాగంగా టౌన్ సీఐ శివశంకర్, టౌన్ ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో డాగ్ స్క్వాడ్ పోలీసులతో కలిసి బస్టాండ్, పాన్ షాపులు, కిరాణా దుకాణాలు తదితర ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శివశంకర్ మాట్లాడుతూ యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా కాపాడేందుకు జిల్లా పోలీసు శాఖ ప్రత్యేక చర్యలుచేపడుతోందన్నారు. డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాల విక్రయం, రవాణా లేదావినియోగానికి పాల్పడే వారిపైచట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిం చారు.ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్, గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన అనుమానాస్పద కార్యకలా పాలు గమనించినట్లయితే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌కు లేదా డయల్ 100 కు సమాచారం అందించా లని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబ డతాయని తెలిపారు.అలాగే తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనపై ఎప్పటికప్పుడు దృష్టి పెట్టాలని, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి విద్య, ఉపాధి, క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. నారాయణ పేట జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు. అలాగే బస్టాండ్ ఏరియాలో అనుమానిత వ్యక్తుల వేలిముద్రలను ఫింగర్ ప్రింట్స్ డివైస్ తో తనిఖీలు నిర్వహించారు.ఈ తనిఖీల్లో పోలీసు జాగిలం విక్కీ, పిసి పరమేశ్, టౌన్ పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.?

## ఉల్పర-కల్వకుర్తి మధ్య బస్సు సర్వీసులు పెంచాలి

- ప్రయాణికుల డిమాండ్..
- 12 గ్రామాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆవేదన




**ఉప్పునుంతల, జూలై 16 (జనంసాక్షి):** అచ్చంపేట ఆర్టీసీ డిపో నుంచి ఉప్పునుంతల, మొల్గర, ఉల్పర గ్రామాల మీదుగా కల్వకుర్తికి నడిచే బస్సు సర్వీసుల సంఖ్యను పెంచాలని ప్రయాణికులు, స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. గతంలో ఈ మార్గంలో రెండు బస్సులు నడిచేవని, ప్రస్తుతం ఒకే బస్సు మాత్రమే నడుస్తుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. బస్సు సమయాలు సరిపోకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు, రైతులు, వ్యాపారులు, అత్యవసర పనుల కోసం వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒకే బస్సుపై ఆధారపడాల్సి రావడంతో ఉప్పునుంతల, మొల్గర, ఉల్పరతో పాటు దాదాపు 12 గ్రామాల ప్రజలు రవాణా సమస్యలను ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. కావున సంబంధిత ఆర్టీసీ అధికారులు స్పందించి ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఉల్పర-కల్వకుర్తి మార్గంలో అదనపు బస్సు సర్వీసులు ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులను వెంటనే పరిష్కరించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

## తహసీల్దార్ కార్యాలయంలో తృటిలో తప్పిన పెను ప్రమాదం

- కంప్యూటర్ గది పైకప్పు కూలిపోవడంతో టైపిస్ట్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు



**ఉప్పునుంతల, జూలై 16 (జనంసాక్షి):** ఉప్పునుంతల తహసీల్దార్ కార్యాలయంలో గురువారం తృటిలో పెను ప్రమాదం తప్పింది. కార్యాలయంలోని కంప్యూటర్ గది పైకప్పు ఒక్కసారిగా పెచ్చులూడి కూలిపోవడంతో అక్కడ విధు లు నిర్వహిస్తున్న టైపిస్ట్ మల్లికార్జున్ ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. సమాచారం ప్రకారం.. పైకప్పు కూలిపోవడాని కి కొద్దిసేపటి ముందు చిన్న పెచ్చు ముక్క ఊడి పడటాన్ని గమనించిన మల్లికార్జున్ అప్రమత్తమై వెంటనే పక్కకు తప్పుకున్నారు. అనంతరం పెద్ద మొత్తంలో పైకప్పు కూలి పోవడంతో భారీ శబ్దం వినిపించింది. దీంతో కార్యాలయానికి వివిధ పనుల నిమిత్తం వచ్చిన ప్రజలు, సిబ్బంది ఒక్కసారిగా ఘటనాస్థలికి చేరుకుని ఆందోళనకు గురయ్యారు. అదృష్టవశాత్తు ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అయితే గదిలో ఉన్న కుర్చీలు, ఇతర సామగ్రి ధ్వంస మయ్యాయి. శిథిలావస్థకు చేరుకున్న తహసీల్దార్ కార్యాలయ భవనం ఎప్పుడైనా పెద్ద ప్రమాదానికి కారణమయ్యే అవకాశం ఉందని స్థానికులు, కార్యాలయ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి భవనానికి మరమ్మతులు చేపట్టి, ఉద్యోగులు, ప్రజల భద్రతకు అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

## భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అందుకోవాలి: అదనపు ఎస్పీ రియాజ్



**నారాయణపేట జిల్లా బ్యూరో, జూలై 16(జనంసాక్షి):** అవార్డులు పొందిన విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అందుకోవాలని వారిని తోటి విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలని నారాయణపేట అదనపు ఎస్పీ రియాజ్ అన్నారు.గురువారం నారాయణపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రతిభా పురస్కారాల సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యా ర్థుల ప్రతిభా పురస్కారాల సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహిం చారు. గత విద్యాసంవత్సరంలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం లో అత్యుత్తమ మార్కులు సాధించిన టాపర్లకు, అలాగే ద్వితీయ సంవ త్సరం పూర్తి చేసుకొని టీటీసీలో ప్రవేశ పరీక్షలో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు ఈ సందర్భంగా ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా అడిషనల్ ఎస్పీ రియాజ్, విచ్చేశారు. కళాశాల ప్రిన్సిపాల్ జిల్లా అధికారి, సుదర్శన్‌రావు విద్యా ర్థులకు పురస్కారాలు, ప్రోత్సాహం బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో భాగంగా డాక్టర్ రవీందర్ లకావత్ విద్యార్థులకు మెమెంటోలు, ప్రత్యేక బహుమతులను అందజేసి అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించా లని, జీవితంలో స్థిరపడాలనే ఉద్దేశంతో ఈ ప్రోత్సాహక బహుమ తులను అందించడం జరిగిందని తెలిపారు. సన్మానం పొందిన విద్యా ర్థులను స్ఫూర్తిగా తీసుకుని, తోటి విద్యార్థులు కూడా రాబోయే ఇంట ర్మీడియట్ పరీక్షల్లో మరియు పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకుంటే వారి భవిష్యత్తు ఎంతో ఉజ్వలంగా ఉంటుందని వక్తలు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, సిబ్బంది విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సామాజిక-ఆర్థిక అభివృద్ధిలో నాబార్డ్ కీలక పాత్ర పోషిస్తూ దేశ అభివృద్ధికి అండగా నిలుస్తోంది



**నారాయణపేట జిల్లా బ్యూరో జూలై16 (జనంసాక్షి):** గ్రామీణాభివృద్ధి, వ్యవసాయాభివృద్ధి సమగ్ర సామాజిక-ఆర్థిక అభివృద్ధిలో నాబార్డ్ ఎల్లప్పుడూ కీలక పాత్రపోషిస్తూ దేశ అభివృద్ధికి అండగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ సీహెచ్ ప్రియాంక అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రీఫైనా న్సింగ్, రైతులకు ఆర్థిక సహాయం, మహిళా సంఘాలకు ఫైనాన్సియల్ సపోర్ట్, నేచురల్ ఫార్మింగ్ ప్రోత్సాహం వంటి అనేక రంగాల్లో నాబార్డ్ ఎంతో విశేషమైన సేవలు అందిస్తోందన్నారు.నా బార్డ్ డే సందర్భంగా గురువారం జిల్లా కేంద్రానికి సమీపంలోని సింగారం మలుపు దారి వద్ద గల వృత్తి నైపుణ్య శిక్షణా కేంద్రంలో ఏర్పాటు చేసిన శిక్షణా కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. నారాయణ పేట జిల్లాలో కూడా నాబార్డ్ ఇటీవల తన కార్యకలాపాలను మరింత విస్తరించడం చాలా సంతోషకరమైన విషయం అన్నారు.మనలాంటి గ్రామీణ జిల్లా అభివృద్ధికి నాబార్డ్ వంటి సంస్థలు చేరువ కావడం ఎంతో అవసరం అని తెలిపారు.

స్వయం సహాయక సంఘాల ( ఎస్ హెచ్ జి ఎస్ సభ్యులు నాబార్డ్ అందిస్తున్న అభివృద్ధి అవకాశాలు, పథకాలను పూర్తిగా సద్వినియోగం చేసుకుని తమ జీవనోపాధిని మరింత మెరుగుపరచుకోవాలని ఆమె సూచించారు. దేశంలో ఎన్నో ఆర్థిక సంస్థలు ఉన్నప్పటికీ, గత 45 సంవత్సరాలుగా గ్రామీణ ప్రజలకు నమ్మకమైన భాగస్వామిగా నాబార్డ్ సేవలందిస్తోందన్నారు. జిల్లా అభివృద్ధికి సంబంధించిన ఏ సమావేశం జరిగినా, జిల్లా కలెక్టర్ పిలుపు వచ్చిన వెంటనే స్పందిస్తూ, "మేము సిద్ధంగా ఉన్నాం... అవసరమైతే డీపీఆర్‌లు తయారు చేస్తాం... మా వద్ద నిధులు ఉన్నాయి...జిల్లాకు అవసరమైన సహకారం అందిస్తాం" అనే సానుకూల దృక్పథంతో నాబార్డ్ అధికారులు ఎప్పుడూ ముందుంటున్నారని ఆమె పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఈ సహ కారం మరింత బలపడాలని మనస్ఫూర్తిగా ఆశిస్తున్నానని అన్నారు. ముఖ్యంగా మన జిల్లా మహిళలకు నా బార్డ్ సంస్థలు సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నప్పుడు, మనం కూడా ముందుకు రావాలని, మనం ఏం చేయగలం? మన గ్రామాల్లో ఏ అవకాశాలు ఉన్నాయి? ఏ వ్యాపారాలు ప్రారంభించవచ్చు? అనే విషయాల్లో ధైర్యంగా ముం దుకు రావాలని మహిళా సంఘాల సభ్యులకు ఆమె సూచించారు. సంఘాలతో నిరంతరం అనుసంధానంగా ఉండాలని, రుణం తీసు కోవడమే కాకుండా ఆ రుణాన్ని సరైన విధంగా ఉపయోగించి మరింత ఆదాయం వచ్చేలా వ్యాపారాన్ని విస్తరించాలన్నారు. ప్రభు త్వం అందిస్తున్న పథకాలు, సబ్సిడీలు, ఇతర అవకాశాలను కూడా సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.నా బార్డ్ అందించబోయే ప్రెజెంటేషన్‌లో కూడా ఈ అంశాల గురించి వివరంగా తెలియజేస్తా రనీ, అందరూ శ్రద్ధగా విని, ఎలాంటి సహాయం అవసరమైనా నాబార్డ్ సంస్థ ద్వారా, అలాగే సంబంధిత ప్రభుత్వ శాఖల ద్వారా తాము ఎల్ల ప్పుడూ మీకు అండగా ఉంటామని కలెక్టర్ భరోసా ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం "కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలి"అనే లక్ష్యంతో పనిచేస్తోందనీ, అలాగే నారాయణపేటను ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారని,ఆ మహత్తర లక్ష్య స్వయం సహాయక సంఘాల బలోపేతం మహిళా పారిశ్రామిక వేత్తల అభివృద్ధి విజయ గాథల గురించి ట్రైనీ శ్రీనివాస్ వివరించారు. ఈ కార్యక్రమంలో డీ ఆర్డీవో వెంకట్ రాములు, నాబార్డు డీ డీ మహేందర్ బాబు, ఎల్ డి ఎం విజయ్ కుమార్, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వర గౌడ్, ఉద్యాన శాఖ జిల్లా అధికారి సాయిబాబా, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతి, కార్యదర్శి పద్మమ్మ, కోశాధికారి అంజమ్మ, మున్సిపల్ కమిషనర్ శంకర్, డీ పీ ఎం లు, ఏ పీ ఎం లు, తదితరులు పాల్గొన్నారు.

## అనారోగ్యంతో మాజీ పంచాయతీ కార్మికుని మృతి

- కుటుంబానికి హరీశ్‌రావు రూ.5 వేల ఆర్థిక సాయం



**నంగునూరు, జూలై 16 (జనంసాక్షి):** సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం సిద్ధన్నపేట గ్రామానికి చెం దిన మాజీ పంచాయతీ కార్మికుడు కందికట్ల ఆగయ్య అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందారు. పదేళ్లుగా ఆయన పక్షవాతంతో బాధపడుతూ మంచానికే పరిమితమయ్యారు. దీర్ఘకాలంగా అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటూ కుటుంబం ఆర్థికంగా తీవ్ర ఇబ్బందుల్లో కొనసాగుతోంది. ఆగయ్య భార్య గ్రామంలో పంచాయతీ కార్మికురాలిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. వృద్ధాప్యం కారణంగా ఇటీవల ఆమె కూడా విధుల నుంచి విరమణ పొందినట్లు గ్రామస్తులు తెలిపారు. వెంటనే స్పందించిన ఆయన రూ.అయిదు వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సహాయాన్ని ఆగయ్య భార్యకు బీఆర్ఎస్ నాయకులు గురువారం అందించి, కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా గ్రామ బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ, కష్టకాలంలో ప్రజలకు అండగా నిలవడం హరీశ్ రావు ప్రత్యేకత అని పేర్కొన్నారు. ఆగయ్య కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు పార్టీ నాయకులు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఆర్థిక సహాయం అందజేసిన కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు బండి మల్లేశం, నాయకులు బండి ప్రశాంత్, దాకూరి కోటీశ్వర్ రెడ్డి, దాకూరి భాస్కర్ రెడ్డి, బొల్లు సంపత్, దేవులపల్లి ఎల్లయ్య, గజ్జల సతీశ్ రెడ్డి, పరకాల కిష్టారెడ్డి, వెంకట్, మల్లేశం, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఐఆర్ ఫారాలను తొందరగా ఇవ్వాలి

- తాసిల్దార్ ఝాన్సీరాణి



**మల్దకల్ జూలై 16 (జనంసాక్షి):** మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారము ఎస్ ఐఆర్ పై బిఎల్ ఏ,గ్రామపంచాయతీ కార్యదర్శులకు జిపిఓ లకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ ఝాన్సీరాణి మాట్లాడుతూ గ్రామాలలో సర్ పారాలను తొందరగా నింపి బిఎల్ఎ లకు ఇవ్వాలని ఆమె సూచించారు.ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటర్ జాబితాలో డబల్ పేర్లు ఉన్నవారు తొలగించుకోవాలని ఒకే పేరుతో ఓటర్ జాబితాలో ఉంచుకోవాలని ఆమె అన్నారు. వచ్చే నెల మూడో తేదీ వరకు ఎన్నికల కమిషన్ పొడిగింపు చేయడంతో సర్ పారాలను తొందర తొందరగా ఇవ్వాలని,ప్రతి ఒక్కరు బిఎల్ఓ బిఎల్ఎ సహకరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయ రెడ్డి,ఆర్ఐ మహేందర్, సీనియర్ అసిస్టెంట్ కరీం, పంచాయతీ కార్యదర్శులు సూపర్వైజర్లు తది తరులు పాల్గొన్నారు.

## రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి



**ఇటిక్యాల, జూలై 16 (జనంసాక్షి):** ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో వైద్య సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని ఇటికాల పిహెచ్ సి డాక్టర్ రాధిక అన్నారు. గురువారం ఇటిక్యాల పిహెచ్ సిలో వైద్య సిబ్బంది, ఆశాలతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 13న ఆల్బెండాజోల్ మాత్రలు వేయించుకొని 1నుంచి 19 సంవత్సరాల వయస్సు గల వారికి ఈనెల 20న మాత్రలను వేసేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రజలకు మెరుగైన వైద్యసేవలతో పాటు ప్రసవాల సంఖ్యను పెంచేలా వైద్య సిబ్బంది చర్యలు తీసుకోవాలని అన్నారు.

## పైన బూడిద... లోన ఇసుక

- ఇసుక సురుల మాయ
- ఛేదించిన పోలీసులు
- టిప్పర్ సీజ్



**కృష్ణ, జూలై 16 (జనంసాక్షి):**
ఇసుక సిరుల మాయల గారడి. పైన బూడిద లోపల ఇసుక తో అక్రమ ఇసుక రవాణా చేస్తూ అధికారుల కళ్ళు కప్పి, ఇసుక దందాను ఇసుక మాఫియా యదేచ్ఛగా కొనసాగిస్తు న్నారు. వారి మాయల గారడిని అధికారులు ఎట్టకేలకు చెక్ పెట్టారు.గురువారం ఉదయం ఆరు గంటల సమయంలో కృష్ణ పోలీస్ పోలీసులు గుడేబల్లూరు గ్రామంలో గస్తీ తిరుగుతుండగా టై రోడ్ వద్ద ఒక టిప్పర్ అనుమానా స్పదంగా వెళుతుండగా దానిని ఆపి చెక్ చేయగా దాన్ని పైన బూడిద నిండా ఇసుక లోడు ఉన్నట్లు గుర్తించారు. ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా కృష్ణా నది నుండి తరలిస్తున్నందువల్ల అట్టి టిప్పరు కెఎ32ఎఎ5085ను స్టేష న్‌కు తరలించి టిప్పర్ డ్రైవర్ షేక్ మహబూబ్ ఇబ్రహీం, టిప్పర్ యజమాని పేరు శ్రీకాంత్ మీద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు కృష్ణ ఎస్ఐ నవిద్ తెలిపారు.

## చేనేత కార్మికులకు ఫైర్ కిట్లు పంపిణి



**అయిజ, జులై 16 (జనంసాక్షి):** అయిజ చేనేత సహకార సంఘం ఆధ్వర్యంలో ఉచిత ఫైర్ సేఫ్టీ కిట్ల పంపిణీ చేశారు. అయిజ చేనేత సహకార సంఘం అధ్యక్షులు డాన్ వీరన్న ఆధ్వర్యంలో మగ్గాలు ఉన్నటువంటి చేనేత కార్మికులకు ఉచిత ఫైర్ సేఫ్టీ కిట్ల పంపిణీతో పాటు ఉద్యం సర్టిఫికెట్ మరియు జెడ్ సర్టిఫికెట్లు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ మేనేజర్ సత్యనారాయణ, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

## మహిళా సమాఖ్య భవనాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత

- సర్పంచ్ అబ్దుల్ రషీద్



**ఉర్కొండ, జూలై 16, (జనంసాక్షి);** మహిళా సమైఖ్య భవనాల నిర్మాణాలకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, భవన నిర్మాణ పనుల్లో నాణ్యత పాటించాలనీ సర్పంచ్ అబ్దుల్ రషీద్ స్పష్టం చేశారు.మండలంలోని ఊర్కొండపేటలో నిర్మిస్తున్న మహిళా సమాఖ్య భవన నిర్మాణ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. గురువారం ఈ భవనానికి సంబంధించిన స్లాబ్ పనులను పూర్తి చేసినట్లు సర్పంచ్ అబ్దుల్ రషీద్ తెలిపారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ భవనం మహిళల ఆర్థికాభివృద్ధికి, గ్రామస్థాయిలో వివిధ సమావేశాల నిర్వహణకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా, నిర్ణీత గడువులోగా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ రేపాని శ్రీనివాసులు,మహిళా సంఘం అధ్యక్షురాలు పార్వతమ్మ,బుక్ కీపర్ మాధవి, అర్చకులు దత్తు,చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## బాల కార్మికులను గుర్తించిన అధికారులు



**అయిజ, జులై 16(జనంసాక్షి):** ఆపరేషన్ ముస్కాన్-12లో భాగంగా 8 మంది బాలలను రక్షించిన అధికారులు.జోగులాంబ గద్వాల జిల్లా సంబంధిత శాఖల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆపరేషన్ ముస్కాన్-12 కార్యక్రమంలో భాగంగా నేడు అయిజ పట్టణంలో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పెంటర్ షాపుల్లో బాల కార్మికులుగా పనిచేస్తున్న 5 మంది బాలలను, బైక్ మెకానిక్ షాపుల్లో పనిచేస్తున్న ఇద్దరు మైనర్ బాలులను గుర్తించి రక్షించారు. అదేవిధంగా గొర్రెల కాపరిగా పనిచేస్తున్న ఒక బాలుడిని కూడా అధికారులు రక్షించారు. రక్షించిన మొత్తం 8 మంది బాలలను తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరుపరచనున్నట్లు సహాయ కార్మిక అధికారి వేణుగోపాల్ మరియు బాలల సంరక్షణ కౌన్సిలర్ సురేష్ తెలిపారు. గొర్రెల కాపరిగా బాలుడిని పనిలో పెట్టుకున్న యజమానిపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసినట్లు వారు వెల్లడించారు. ఈ సందర్భంగా బాలలను పనిలో పెట్టుకోవడం చట్టవిరుద్ధమని, 14 సంవత్సరాల లోపు పిల్లలను ఎట్టి పరిస్థితుల్లోనూ పనిలో నియమించరాదని, అలాగే 14 నుండి 18 సంవత్సరాల మధ్య వయస్సు గల బాలలను ప్రమాదకర పనుల్లో నియమించడం కూడా నేరమని ప్రజలకు సూచించారు. బాల కార్మికులను గుర్తించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించి బాలల రక్షణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ కానిస్టేబుల్ సుధారాణి, కానిస్టేబుల్ భరత్ పాల్గొన్నారు.

## నేతివానిపల్లిలో భూరీ సర్వే పై అవగాహన సదస్సు



**మల్దకల్, జూలై 16(జనంసాక్షి):** మండల పరిధిలోనినేతివానిపల్లి గ్రామంలో గురువారం భూముల రి సర్వే పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా తహసిల్దార్ ఝాన్సీరాణి హాజరై సర్వే గురించి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న భూముల రి సర్వేలో భాగంగా జోగులాంబ గద్వాల జిల్లాలో రి సర్వే మల్దకల్ మండలంలోని ఏడు గ్రామాలను ఎంపిక చేసి ముందస్తుగా ఆయా గ్రామాలలో రి సర్వే నిర్వహిస్తున్నట్లు ఆమె అన్నారు.నేతువానిపల్లి గ్రామంలో రిసర్వే చేస్తామని అన్నారు. దీని ముఖ్య ఉద్దేశం గ్రామ కంఠం గ్రామ శివారు గ్రామంలోని రోడ్లు పట్టా భూములు ప్రభుత్వ భూములు తదితర వాటిని సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ బీచుపల్లి, గిర్ధవర్ మహేందర్, సర్పంచు పద్మమ్మ,జిపిఓ పంచాయతీ కార్యదర్శి, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.ఈనెల 21వరకు గ్రామాలలో సదస్సులు ఎద్దులగూడెం, ఉల్లిగపల్లి, శేషంపల్లి గ్రామాలలో జరుగుతాయి.

## మినిమల్లీ ఇన్వాసివ్, రోబోటిక్ కార్డియాక్ సర్జరీతో సురక్షిత చికిత్స

- అత్యాధునిక సాంకేతికతతో గుండె శస్త్రచికిత్స- రోగులకు మెరుగైన ప్రయోజనాలు

**మహబూబ్‌నగర్ అర్బన్ జూలై 16 (జనంసాక్షి):**
డాక్టర్ సత్య శ్రీధర్ మాట్లాడుతూ, ప్రస్తుతం మినిమల్లి ఇన్వాసివే కార్డిక్ సర్జరీ మరియు రోబోటిక్ కార్డిక్ సర్జరీ వంటి అత్యాధునిక విధానాల ద్వారా గుండె శస్త్రచికిత్సలను అత్యంత సురక్షితంగా, కచ్చితత్వంతో నిర్వహిస్తున్నామని చెప్పారు. సాంప్రదాయ ఓపెన్ హార్ట్ సర్జరీలో ఛాతీ ఎముకను పూర్తిగా తెరవాల్సి వస్తుందని, కానీ మినిమల్లీ ఇన్వాసివ్ కార్డియాక్ సర్జరీలో కేవలం కొన్ని సెంటీమీటర్ల చిన్న కోతల ద్వారానే శస్త్రచికిత్సను విజయవంతంగా పూర్తి చేయవచ్చని వివరించారు. దీంతో రోగికి రక్తస్రావం తక్కువగా ఉండటమే కాకుండా శస్త్రచికిత్స అనంతర నొప్పి, ఇన్ఫెక్షన్ ప్రమాదం, ఐసీయూ మరియు ఆసుపత్రిలో గడపాల్సిన రోజులు కూడా గణనీయంగా తగ్గుతాయని చెప్పారు.

రోబోటిక్ కార్డియాక్ సర్జరీలో అత్యాధునిక రోబోటిక్ వ్యవస్థలను ఉపయోగించడం ద్వారా శస్త్రచికిత్స సమయంలో అత్యంత సూక్ష్మమైన కదలికలను కూడా ఖచ్చితంగా నియంత్రించవచ్చని తెలిపారు. దీని వల్ల క్లిష్టమైన గుండె సంబంధిత శస్త్రచికిత్సలను మరింత సురక్షితంగా నిర్వహించడంతో పాటు రోగులకు అత్యుత్తమ ఫలితాలు అందించగలుగుతున్నామని పేర్కొన్నారు.మిట్రల్ వాల్వ్ వ్యాధులు, ట్రైకస్పిడ్ వాల్వ్ సమస్యలు, గుండెలో రంధ్రాలు ఎంపిక చేసిన బైపాస్ శస్త్రచికిత్సలు, గుండెలోని కొన్ని కణితులు వంటి అనేక గుండె సంబంధిత సమస్యలకు ఈ ఆధునిక శస్త్రచికిత్స విధానాలు విజయవంతంగా ఉపయోగపడుతున్నాయని వివరించారు.ఈ విధానాల్లో శస్త్రచికిత్స చేయించుకున్న రోగులు సాధారణంగా తక్కువ




సమయంలోనే నడవడం ప్రారంభించడంతో పాటు త్వరగా ఇంటికి వెళ్లే అవకాశం ఉంటుందని, ఉద్యోగులు, వ్యాపారులు, వృద్ధులు, మహిళలు తమ దైనందిన జీవితానికి త్వరగా తిరిగి చేరుకునేందుకు ఈ సాంకేతికత ఎంతో ఉపయోగపడుతోందని తెలిపారు. శరీరంపై పెద్ద మచ్చలు లేకపోవడం వల్ల మానసికంగా కూడా రోగులు సంతృప్తి చెందుతున్నారని పేర్కొన్నారు.గుండె సంబంధిత వ్యాధులు ప్రస్తుతం యువతలో కూడా పెరుగుతున్న నేపథ్యంలో ఛాతి నొప్పి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, నడిచినప్పుడు ఆయాసం, గుండెదడ, కాళ్ల వాపు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే గుండె నిపుణులను సంప్రదించాలని డా.సత్య శ్రీధర్ కాలే సూచించారు. ప్రారంభ దశలోనే వ్యాధిని గుర్తించి సరైన చికిత్స తీసుకుంటే అత్యు త్తమ ఫలితాలు సాధించవచ్చని అన్నారు. ప్రపంచస్థాయి వైద్య సాంకేతికత, అత్యాధునిక ఆపరేషన్ థియేటర్లు, రోబోటిక్ శస్త్రచికిత్స సదుపాయాలు, అనుభవజ్ఞులైన కార్డియాక్ సర్జన్లు, కార్డియాలజిస్టులు, అనస్థీషియా నిపుణులు మరియు ప్రత్యేకంగా శిక్షణ పొందిన నర్సింగ్ బృందంతో యశోద హాస్పిటల్స్ సికింద్రాబాద్ యూనిట్ గుండె చికిత్సలో దేశంలోని ప్రముఖ కేంద్రాలలో సేవలందిస్తోందని తెలిపారు

# అధ్వానంగా అంగన్వాడి కేంద్రాలు..



లేక ఇబ్బందికరంగా మారుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. చిన్నారుల ఆరోగ్యం,విద్యకు కీలకమైన ఈ కేంద్రాల పరిస్థితిపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పుల్కల్ మండలంలోని అంగన్వాడి కేంద్రాలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించి, శిథిలావస్థలో ఉన్న భవనాలకు మరమ్మతులు చేపట్టాలని,అవసరమైన చోట కొత్త భవనాల నిర్మాణం చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**మరో భవనంలోకి మారుస్తాం: అంజుమ్ సూపర్వైజర్**

సింగూరు అంగన్వాడి నాలుగో కేంద్రం శిథిలావస్థకు చేరిన మాట వాస్తవమే.గత కొన్ని నెలలుగా మరో భవనాన్ని వెతుకుతున్నాం. మరో రెండు మూడు రోజుల్లో ఆ కేంద్రాన్ని అక్కడి నుంచి అద్దె భవనంలోకి మారుస్తాం. అద్దె భవనాలు దొరకకపోవడం వల్లే ఇప్పటివరకు అక్కడే కొనసాగించాం.ప్రస్తుతం వర్షాకాలం కాబట్టి తప్పకుండా వెతికి మరో భవనంలోకి మారుస్తాం.చిన్నారుల భవితవ్యమే మాకు ముఖ్యం.

# తహసీల్దారు కార్యాలయంలో త్రాగునీటి సమస్య



**ధరూర్, జూలై 16 (జనంసాక్షి):**
జోగులాంబ గద్వాల జిల్లా ధరూర్ మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయంలో త్రాగునీటి సమస్య తీవ్రంగా ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వివిధ గ్రామాల నుంచి వందల సంఖ్యలో ఆర్జీదారులు తమ పనుల నిమిత్తం కార్యాలయానికి వస్తుంటారు. అయితే కార్యాలయంలో ఏర్పాటు చేసిన త్రాగునీటి కుండలో నీరు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేసవి, వర్షాకాలం అనే తేడా లేకుండా కార్యాలయానికి వచ్చే ప్రజలకు కనీస త్రాగునీటి సౌకర్యం కల్పించాల్సిన అవసరం ఉందని వారు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి తహసీల్దారు కార్యాలయంలో నిరంతర త్రాగునీటి సౌకర్యం ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

# పేద విద్యార్థులకు అండగా మాజీ ఎంపీపీ తిప్పర్తి అరుణ నరసింహారెడ్డి

- సొంత ఖర్చుతో టేబుళ్లు, కుర్చీలు అందజేస్తానని హామీ




**ఉప్పునుంతల, జూలై 16 (జనంసాక్షి):** ఉప్పునుంతల గ్రామ పంచాయతీ పరిధిలోని గట్టుకాడిపల్లి ప్రాథమిక పాఠశాలను మాజీ ఎంపీపీ తిప్పర్తి అరుణ నరసింహారెడ్డి గురువారం సందర్శించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులను కలిసి వారి సమస్యలు, ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడిన తిప్పర్తి అరుణ నరసింహారెడ్డి, “పేదరికాన్ని జయించాలంటే చదువే గొప్ప ఆయుధం. బాగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలి” అని వారికి సూచించారు. ఆయన మాటలు విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపాయి. ఈ కార్యక్రమంలో రామస్వామి, ప్రవీణ్, రజినీకాంత్, కుర్మయ్య, జగన్, లాలయ్య, రామకృష్ణ, సాయిరాం, శ్రీను, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్
- ప్రతి వారం పనుల్లో స్పష్టమైన పురోగతి కనిపించాలి
- రాయిచేడ్‌లో నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్
- నిర్ణీత గడువులోగా నాణ్యతతో పనులు పూర్తి చేయాలని అధికారులకు ఆదేశం



**ఉప్పునుంతల, జూలై 16 (జనంసాక్షి):**
నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకుండా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ అధికారులను ఆదేశించారు. ప్రతి వారం పనుల్లో స్పష్టమైన పురోగతి కనిపించేలా కార్యాచరణ చేపట్టాలని సూచించారు. గురువారం ఉప్పునుంతల మండలంలోని రాయిచేడ్ గ్రామంలో అచ్చంపేట నియోజకవర్గానికి మంజూరైన ప్రతిష్ఠాత్మక ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవన నిర్మాణ పనులను కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణ పురోగతి, నాణ్యత, ప్రస్తుత దశ, ఎదురవుతున్న సమస్యలపై సంబంధిత అధికారులతో సమగ్ర సమీక్ష నిర్వహించారు.

నిర్మాణ స్థలాన్ని పూర్తిగా పరిశీలించిన కలెక్టర్, ప్రభుత్వం ఆమోదించిన డిజైన్, మ్యాప్, సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగానే పనులు కొనసాగాలని స్పష్టం చేశారు. ఆమోదించిన నమూనాలో ఎలాంటి మార్పులు చేయకుండా నిర్దేశిత ప్రమాణాల ప్రకారం నిర్మాణాన్ని చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ప్రస్తుతం కొనసాగుతున్న బేస్‌మెంట్ పనులపై ప్రత్యేక దృష్టి సారించిన ఆయన, అవసరమైన యంత్రాలు, నిర్మాణ సామగ్రి, కార్మికులను సమకూర్చి పనులను వేగవంతం చేయాలని



సూచించారు. ప్రతి వారం పనుల్లో స్పష్టమైన పురోగతి కనిపించేలా లక్ష్యాలను నిర్దేశించుకుని అమలు చేయాలని చెప్పారు.

నిర్మాణ పనుల్లో నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని, సిమెంట్, స్టీల్, కాంక్రీట్ తదితర నిర్మాణ సామగ్రి నాణ్యతను నిరంతరం పరీక్షిస్తూ ఇంజినీరింగ్ ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. నిర్మాణ ప్రాంగణంలో భద్రతా చర్యలను కూడా పకడ్బందీగా అమలు చేయాలని సూచించారు.

పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రతి దశ పూర్తయిన వెంటనే నాణ్యతా తనిఖీలు నిర్వహించాలని, నిర్మాణంలో ఎదురయ్యే సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని కలెక్టర్ సూచించారు.

అచ్చంపేట నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంత విద్యార్థులకు మెరుగైన విద్యా అవకాశాలు కల్పించడంలో ఈ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల కీలకంగా మారుతుందని కలెక్టర్ తెలిపారు. ఆధునిక తరగతి గదులు, వసతి గృహాలు, ప్రయోగశాలలు, గ్రంథాలయం, కంప్యూటర్ ల్యాబ్‌లు, క్రీడా మైదానాలు, డైనింగ్ హాల్ తదితర సౌకర్యాలతో సమగ్ర విద్యా వాతావరణాన్ని ప్రభుత్వం కల్పిస్తోందన్నారు.

నిర్మాణ పనులు నిర్ణీత గడువులోగా పూర్తయ్యేలా అన్నిశాఖలు సమన్వయంతో పనిచేయాలని, పనులపై నిరంతరం సమీక్షలు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. అలసత్వం లేదా నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిపై బాధ్యత నిర్ధారించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అభివృద్ధి పనుల్లో వేగం, నాణ్యత రెండూ సమానంగా ఉండాలని, ప్రజాధనం వృథాకాకుండా ప్రతి రూపాయి ఫలితమిచ్చేలా అధికారులు పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఈడబ్ల్యూఐడీసీ ఈఈ, అచ్చంపేట ఆర్డీఓ యాదగిరి, తహసీల్దార్ అద్దంకి సునీత, ఎంపీడీవో వరుణ్ తేజ్, మండల వ్యవసాయ అధికారి రమేష్ నాయక్, ఇంజినీరింగ్ అధికారులు, వివిధ శాఖలకు చెందిన మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# అర్హులైన లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయాలి: జిల్లా కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో జూలై 16(జనంసాక్షి):** అర్హులైన లబ్ధిదారులకు బ్యాంకర్లు రుణాలు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆదేశించారు.గురువారం జిల్లా కలెక్టరేట్ వీసీ హాల్ లో పీ ఎం ఎఫ్ ఎం ఈ, పీఎం విశ్వకర్మ పథకాల కింద తిరస్కరించబడిన దరఖాస్తులపై కలెక్టర్ బ్యాంకర్ల తో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎస్‌బీఐ శాఖలలో తిరస్కరణలు అధికంగా ఉన్నాయని తెలిపారు. అన్ని దరఖాస్తులను స్పష్టంగా పరిశీలించి,అర్హులైన లబ్ధిదారులకు రుణాలు మంజూరుచేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ఇతర బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తున్నప్పటికీ, ఎస్‌బీఐలో మాత్రమే ఎక్కువ తిరస్కరణలు నమోదవుతున్నాయని పేర్కొన్నారు.ఈ విషయంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సమన్వయం చేసి సమస్యలను పరిష్కరించాలని సూచించారు.వివిధ బ్యాంకులకు కేటాయించిన పీఎం విశ్వకర్మ దరఖాస్తులను బ్యాంకుల వారీగా సమీక్షించి, అర్హులైన వారికి రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. బ్యాంకుల వారీగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ కార్పొరేషన్ రుణాల వివరాలను ఆ కార్పొరేషన్ ఈడీ అబ్దుల్ ఖలీల్ సమావేశంలో వివరించగా, పెండింగ్ దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు.బ్యాంకర్లు, ఏపీఎంలు, డీపీఎంలు పరస్పర సమన్వయంతో పనిచేసి, ఎలాంటి గ్యాప్‌లు లేకుండా అన్ని పెండింగ్ అంశాలను పరిష్కరించాలని ఆమె సూచించారు. పీఎండీడికేవై కార్యక్రమంపై ప్రస్తుతం ప్రత్యేక సమీక్ష జరుగుతోందని, ఢిల్లీ నుంచి ప్రత్యేక అధికారి కూడా సమీక్ష నిర్వహిస్తున్నందున, లక్ష్యాలను సమయానికి పూర్తి చేయాలని తెలిపారు. బ్యాంకులు ఆమోదించిన రుణాలను వీలైనంత త్వరగా గ్రౌండింగ్ చేయాలని, ఆగస్టు 15 న చివరి గడువుగా నిర్దేశించినందున, అప్పటిలోగా 100 శాతం గ్రౌండింగ్ పూర్తి చేయాలని సూచించారు.అన్ని పథకాలలో లక్ష్యాలను 100 శాతం సాధించే దిశగా బ్యాంకర్లు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. స్త్రీ నిధి రుణాలు, స్వయం సహాయక సంఘాల కార్యకలాపాలను కూడా క్రమం తప్పకుండా సమీక్షించి, పురోగతిని వేగవంతం చేయాలని ఆమె సూచించారు. ఈ సమావేశంలో డీఆర్డీ ఓ వెంకట్ రాములు, ఎల్ డీ ఎం విజయ్ కుమార్, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వర గౌడ్, మున్సిపాల్టీ కమిషనర్ శంకర్, వివిధ బ్యాంకుల మేనేజర్లు పాల్గొన్నారు.

# ఎన్నికల ప్రక్రియ విజయవంతం కావడానికి ప్రతి ఓటరు సహకరించాలి

- ఉర్కొండ తహసిల్దార్ యూసుఫ్ అలీ

**ఉర్కొండ, జూలై 16, (జనంసాక్షి):**
ప్రతి ఓటరు తమ ఎన్యుమరేషన్ ఫారాలు నింపి సంబంధిత బిఎల్ఓ లకు అందజేయాలని ఉర్కొండ తహసిల్దార్ యూసుఫ్ అలీ తెలిపారు.

ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఉర్కొండ మండలంలో ఓటరు జాబితా ప్రత్యేక ప్రక్షాళన కార్యక్రమం కొనసాగుతోంది.

ఈ సందర్భంగా మండలంలోని ఓటర్లకు పంపిణీ చేసిన మొత్తం 18,177 ఎన్యుమరేషన్లో ఫారాలలో ఇప్పటి వరకు 13,736 ఫారాలు మాత్రమే సంబంధిత బి ఎల్ వో లకు తిరిగి అందాయి. ఇంకా ఫారాలు సమర్పించని ఓటర్లు తమ ఎన్యుమరేషన్ ఫారాలు వీలైనంత త్వరగా సంబంధిత బి ఎల్ వో



లకు అందజేసి సహకరించవలనీ తహసిల్దార్ విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా ఓటరు మరణించి ఉంటే, కుటుంబ సభ్యులు ఆ విషయాన్నీ బి ఎల్ వో లకు అందజేయాలి.ఒకే వ్యక్తికి రెండు లేదా అంతకంటే ఎక్కువ ఓట్లు ఉన్నట్లయితే, ఆ విషయాన్ని ఫారంలో పేర్కొని ఒకే చోట ఓటు కొనసాగించేందుకు అంగీకారం తెలియజేయాలి.ఓటరు జాబితాను పూర్తిగా, ఖచ్చితంగా రూపొందించేందుకు ప్రతి ఓటరు సహకారం ఎంతో అవసరం. కావున ఉర్కొండ మండలంలోని ప్రతి ఓటరు తమ ఎన్యుమరేషన్ ఫారాలను తప్పనిసరిగా సంబంధిత బి ఎల్ వో లకు క అందజేసి ఎన్నికల ప్రక్రియ విజయవంతం కావడానికి సహకరించాలని తహసిల్దార్ యూసుఫ్ అలీ స్పష్టం చేశారు.